
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
1
కృష్ణా జిల్లా వార్తలు
శుక్రవారం 14 మార్చి 2025



'పల్లె పండుగ' బిల్లులు పెండింగ్!

గత ఆగస్టులో రూ.161.86 కోట్లతో పనులు ప్రారంభం


ఘంటసాల మండలం ఘంటసాలలో అసంపూర్తిగా నిలిచిన సచివాలయ భవనం

- గ్రామ, వార్డు సచివాలయాల నిర్మాణానికి రూ.47 కోట్లు మళ్లింపు
- ఇప్పటి వరకు రూ.93 కోట్ల విలువైన పనులు పూర్తి
- రూ.34 కోట్లకే విడుదలైన బిల్లులు.. మిగిలిన బిల్లుల కోసం ఎదురుచూపు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'పల్లె పండుగ' కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ పథకం నిధులు రూ.161.86 కోట్ల అంచనాలతో జిల్లాలో పనులు చేపట్టారు. ఈ పనులు దాదాపు పూర్తయ్యాయి. అయితే ఈ పనుల బిల్లులను కేంద్రప్రభుత్వం విడుదల చేయాల్సి ఉంది. రూ.93 కోట్ల విలువైన పనులు పూర్తయితే రూ.34 కోట్లే మంజూరయ్యాయి. మిగిలిన బిల్లులు పెండింగ్ పడ్డాయి. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు మొత్తం బిల్లులను మంజూరు చేస్తే, వచ్చే ఆర్థిక సంవత్సరంలో మరిన్ని నిధులు వచ్చే అవకాశం ఉంది. ఈ నెలాఖరులోగా కేంద్ర ప్రభుత్వం బిల్లులు ఎంతమేర విడుదల చేస్తుందనే అంశంపై సందిగ్ధత నెలకొంది.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: కూటమి ప్రభుత్వం పిలుపు మేరకు గతేడాది ఆగస్టు 23వ తేదీన జిల్లాలోని 474 గ్రామ పంచాయతీల్లో ఒకే విడతలో గ్రామసభలు నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ప్రజలు ఇబ్బందులు పడిన ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేయాలని గ్రామసభల్లో నిర్ణయించారు. స్థానికంగా అవసరమైన రోడ్లు, ఇతరత్రా పనులను గుర్తించి గ్రామసభలో తీర్మానం పెట్టి ఆమోదించారు. జిల్లా వ్యాప్తంగా గతేడాది అక్టోబరులో చేపట్టిన 'పల్లె పండుగ' కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు రూ.93 కోట్ల విలువైన సిమెంటు రోడ్లు, గోకులాలు, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్మాణం వంటి పనులను పూర్తిచేశారు. ఇందులో రూ.34 కోట్లను బిల్లులుగా విడుదల చేశారు. మిగిలిన బిల్లులను ఉపాధి హామీ పథకం ద్వారా కేంద్రప్రభుత్వం విడుదల చేయాల్సి ఉంది. ఇప్పటికే జిల్లాలో పూర్తి చేసిన పనులకు ఈ ఏడాది ఏప్రిల్‌లో బిల్లులు విడుదల అయితే, వచ్చే ఆర్థిక సంవత్సరం లెక్కల్లో ఈ పనులు జరిగినట్లుగా చూపుతారు. దీంతో వచ్చే ఆర్థిక సంవత్సరంలో జిల్లాకు ఉపాధి హామీ పథకం ద్వారా నిధుల విడుదలలో కోత పడుతుందని అధికారులు చెబుతున్నారు.

సచివాలయ భవనాలకు నిధులు

గతంలో వైసీపీ ప్రభుత్వం హయాంలో జిల్లాలో 387 సచివాలయ భవనాల నిర్మాణాలను ప్రారంభించారు. అయితే ఈ భవనాల నిర్మాణం బిల్లులు మంజూరు కావడం లేదనే కారణంతో కాంట్రాక్టర్లు కొన్ని భవనాల నిర్మాణ పనులను నిలిపివేశారు. అప్పట్లో ఒక్కో సచివాలయ భవనం నిర్మాణం అంచనాను తొలుత రూ.31 లక్షలుగా నిర్ణయించారు. ఈ నిధులు చాలడం లేదనే కారణంతో ఈ మొత్తాన్ని రూ.43.60 లక్షలకు పెంచారు. వీటిలో 212 సచివాలయ భవనాల నిర్మాణాలను ఎట్టకేలకు పూర్తి చేశారు. జీ+1 పద్ధతిలో నిర్మాణం చేసే ఈ భవనాలు జిల్లాలో మొదటి శ్లాబు దశలో ఆరు, రెండో శ్లాబు దశలో 19 నిలిచిపోయాయి. శ్లాబులు పూర్తి చేసుకుని కిటికీలు, తలుపులు ఇతరత్రా తుది మెరుగులు దిద్దాల్సినవి 75 భవనాలు ఉన్నట్లుగా గుర్తించారు. ఈ 75 సచివాలయ భవనాలకు సంబంధించిన పనులను పూర్తి చేసేందుకు పల్లెపండుగ నిధుల నుంచి రూ.14 కోట్లను కేటాయించారు. వీటితో పాటు అసంపూర్తిగా నిర్మాణంలో ఉన్న సచివాలయ భవనాలకు పల్లె పండుగ ద్వారా మంజూరైన ఉపాధి హామీ నిధులు మరో రూ. 33 కోట్లకుపైగా నిధులను కేటాయించారు. ఈ భవనాల నిర్మాణ పనులు ప్రస్తుతం పురోగతిలో ఉన్నాయి. కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు కల్పించేందుకు రూపొందించిన పల్లె పండుగ పనులకు సకాలంలో ఉపాధి హామీ పథకం ద్వారా ఈనెలాఖరులోగా బిల్లులు మంజూరు చేస్తేనే పనులు మరింతగా వేగవంతంగా జరిగే అవకాశం ఉంది.

అవనిగడ్డ ట్రెజరీ ఉద్యోగి అరెస్టు

రూ.1.58 కోట్లు దారి మళ్లించిన సీనియర్ అకౌంటెంట్ వెంకటరెడ్డి



- పోలీసులకు ఫిర్యాదు చేసిన జిల్లా ట్రెజరీ అండ్ అకౌంట్స్ అధికారి
- వెంకటరెడ్డిని అరెస్టు చేసి మొవ్వ కోర్టులో హాజరుపర్చిన డీఎస్పీ విద్యశ్రీ
- 14 రోజుల రిమాండ్ విధించిన న్యాయాధికారి

అవనిగడ్డ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): అవనిగడ్డ సబ్ ట్రెజరీ కార్యాలయంలో నిధులు దారిమళ్లించిన సీనియర్ అకౌంటెంట్ టంటాం వెంకటరెడ్డిని పోలీసులు గురువారం అరెస్టు చేశారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగుల పేరుతో నకిలీ బిల్లులు పెట్టి సుమారు రూ.1.58 కోట్ల అవినీతికి వెంకటరెడ్డి పాల్పడినట్లు జిల్లా ట్రెజరీ అండ్ అకౌంట్స్ అధికారి ఎస్.రవికుమార్ అవనిగడ్డ పోలీసులకు గత శనివారం ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో అవనిగడ్డ డీఎస్పీ విద్యశ్రీ, సీఐ యువకుమార్, ఎస్ఐ శ్రీనివాస్ తదితరులు వెంకటరెడ్డిని అరెస్టు చేశారు. అనంతరం ట్రెజరీ కార్యాలయంలో విచారణ నిర్వహించారు. నిందితుడు వెంకటరెడ్డిని ఇన్వెస్టిగేషన్ అధికారి అయిన డీఎస్పీ తాళ్లూరి విద్యశ్రీ మొవ్వ కోర్టులో హాజరుపరిచారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయాధికారి రాజన్ ఉదయ్ ప్రకాష్ నిందితుడికి 14 రోజుల రిమాండ్ విధించారు.

విచారణ తీరుపై పెదవి విరుస్తున్న పెన్షనర్లు

సబ్ ట్రెజరీ అధికారులు నిర్వహిస్తున్న విచారణ తీరుపై పెన్షనర్లు పెదవి విరుస్తున్నారు. సీఎఫ్ఎంఎస్ ద్వారా కేవలం లబ్ధిదారుని ఖాతాకు జమ కావాల్సిన మొత్తాలను డూప్లికేట్ బిల్లులు, ఓచర్లు పెట్టి నేరుగా తన ఖాతాకు, అనుచరుల ఖాతాలకు ప్రభుత్వ సొమ్మును ఓ ఉద్యోగి దారి మళ్లించగలగటం, కేవలం రెండు, మూడు రోజుల వ్యవధిలో ఒకే వ్యక్తి పేరుతో సీఎఫ్ఎంఎస్ ఫేజ్-2 సీఎఫ్ఎంఎస్ ఫేజ్-1లకు బిల్లులు పంపి ఫేజ్ -1 నుంచి వచ్చే డబ్బును వేరు ఖాతాలకు బదిలీ చేయించుకోగలగటం ఆ శాఖల్లోని పర్యవేక్షణా లోపాన్ని ఎత్తి చూపుతోందని పెన్షనర్లు ఆరోపిస్తున్నారు. జిల్లా స్థాయి అధికారుల సహాయ సహకారాలు లేకుండా కేవలం ఒక సీనియర్ అకౌంటెంట్ ఇంత పెద్ద మొత్తంలో నిధులు ఎలా దారి మళ్లించగల్లుతారని ప్రశ్నిస్తున్నారు. కానీ అధికారులు మాత్రం సీనియర్ అకౌంటెంట్‌ను మాత్రమే పూర్తిస్థాయిలో బాధ్యుడిని చేస్తూ అతనిపై కేసు పెట్టి, పర్యవేక్షణా లోపాన్ని ఎత్తి చూపుతూ ఎస్టీవోను మాత్రమే సస్పెండ్ చేశారని, జిల్లా అధికారుల పాత్ర గురించి వెంకటరెడ్డి శాఖాపరంగా జరిగిన విచారణ సందర్భంగా పలు కీలక విషయాలు వెల్లడించినప్పటికీ ఆ విషయాలను పట్టించుకోవటం లేదన్న వాదన ట్రెజరీ ఉద్యోగుల నుంచి కూడా వినవస్తోంది.

అవిశ్వాసం నోటీసును కలెక్టర్ లక్ష్మీశకు అందిస్తున్న వైసీపీ అసమ్మతి కౌన్సిలర్లు



తిరువూరులో తిరుగుబాటు

- మునిసిపాలిటీలో వైసీపీ కౌన్సిలర్ల అవిశ్వాస అస్త్రం
- చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి కలెక్టర్‌కు నోటీసు
- అసమ్మతి కౌన్సిలర్ల రహస్య సమావేశం
- అధిష్ఠానం ఆదేశాలను బేఖాతరు చేస్తూ నిర్ణయాలు

తిరువూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : తిరువూరు మునిసిపాలిటీలో వైసీపీ కౌన్సిలర్ల యుద్ధం తారస్థాయికి చేరింది. చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయిపై అవిశ్వాసం ప్రకటించిన అసమ్మతి కౌన్సిలర్లు గురువారం విజయవాడలో కలెక్టర్ లక్ష్మీశకు నోటీసు అందించారు. వైసీపీ అసమ్మతి కౌన్సిలర్లు మోదుగు ప్రసాద్, మోడు దుర్గారావు, పసుపులేటి శేఖర్‌బాబు తదితరులు ఈ నోటీసును కలెక్టర్‌కు అందించారు. తిరువూరు మునిసిపాలిటీలో మొత్తం 20 మంది కౌన్సిలర్లలో అవిశ్వాసం నోటీసు ఇచ్చేందుకు సుమారు 11 మంది సంతకాలు అవసరం. దీంతో వైసీపీ అసమ్మతి కౌన్సిలర్లు గురువారం ఉదయం తిరువూరులో భేటీ అయ్యారు. అవిశ్వాసంపై సంతకాలు సేకరించారు.

అధిష్ఠానాన్ని బేఖాతరు చేస్తూ..

తొలి నుంచి తమకు అన్యాయం జరుగుతున్నా పట్టించుకోని అధిష్ఠానం.. ఇప్పుడు తమ ప్రయత్నాలను అడ్డుకునే ప్రయత్నం చేస్తుండటాన్ని కొందరు వైసీపీ కౌన్సిలర్లు తప్పుబడుతున్నారు. మునిసిపాలిటీలో 20 వార్డులకు 17 స్థానాలు వైసీపీ గెలుపొందింది. 2021, మార్చిలో బోర్డు ఏర్పాటుకు తొలుత చైర్‌పర్సన్‌గా 15వ వార్డు నుంచి గెలుపొందిన మోదుగు ప్రసాద్ పేరును అధిష్ఠానం ప్రకటించింది. ఆ తర్వాత కొన్ని సామాజిక సమీకరణల నేపథ్యంలో చైర్‌పర్సన్‌గా కస్తూరిబాయిని పార్టీ ఎంపిక చేసింది. ఆమె ప్రమాణ స్వీకారం సందర్భంలో.. రెండేళ్ల తర్వాత రాజీనామా చేయాలని, ఆ తర్వాత ప్రసాద్‌ను చైర్‌పర్సన్‌గా ఎంపిక చేయాలని పార్టీ పెద్దలు సూచించారు. రెండున్నరేళ్లయినా ప్రస్తుత చైర్‌పర్సన్ గద్దె దిగలేదు. పైగా అధిష్ఠానం ఆదేశిస్తే రాజీనామా చేస్తామని చెప్పడంతో వైసీపీ కౌన్సిలర్లలో అంతర్గత పోరు నెలకొంది.

అవిశ్వాసం పెట్టి తీరుతాం


మునిసిపల్ చైర్‌పర్సన్‌పై ఎట్టి పరిస్థితుల్లోనూ అవిశ్వాస తీర్మానం పెట్టి తీరుతామని వైసీపీ అసమ్మతి కౌన్సిలర్లు.. కలెక్టర్‌కు నోటీసు అందించారు. ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశానికి ముందురోజు పార్టీ ఇన్‌చార్జి స్వామిదాసు అసమ్మతి కౌన్సిలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరు కావాలని, జగన్ అపాయింట్‌మెంట్ తీసుకుని ఆయన సమక్షంలో అవిశ్వాసంపై నిర్ణయం తీసుకుందామనే ప్రతిపాదన తీసుకొచ్చారు. కౌన్సిల్ సమావేశానికి గైర్హాజరైన కొందరు అసమ్మతి కౌన్సిలర్లు తమ సంతకాలతో కూడిన అవిశ్వాస నోటీసును కలెక్టర్‌కు అందజేశారు. దీంతో మునిసిపాలిటీలో భవిష్యత్తులో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయోనని పట్టణ ప్రజలు ఆసక్తిగా చూస్తున్నారు.

రూ.5 కోట్లు హాంఫట్!

- మున్సిపల్ ఎంప్లాయీస్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ మాయాజాలం
- పాత రుణాలను కట్టాలంటూ కేడీసీసీ బ్యాంకు నుంచి నోటీసులు
- చెల్లించిన రుణానికి మళ్లీ నోటీసులేంటని ఉద్యోగుల కంటతడి
- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వేడుకోలు

ది గుడివాడ మున్సిపల్ ఎంప్లాయీస్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ మాయాజాలం ప్రదర్శించింది. ఉద్యోగుల పేరుతో కేడీసీసీ బ్యాంకు గుడివాడ బ్రాంచిలో రూ.5 కోట్లు హాంఫట్ చేసినట్లు సమాచారం. తీసుకున్న రుణాలు చెల్లించిన వారికి మళ్లీ కట్టాలని బ్యాంకు నుంచి నోటీసులు అందడంతో ఖంగుతిన్నారు. మున్సిపల్ అధికారుల వద్దకెళ్లి కన్నీటిపర్యంతమయ్యారు. దీనికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వేడుకున్నారు.


గుడివాడలోని కేడీసీసీ ప్రధాన శాఖ కార్యాలయం


మున్సిపల్ ఉద్యోగి బకాయి చెల్లించినట్లు మున్సిపల్ కమిషనర్‌కు పంపిన లేఖ

ఆంధ్రజ్యోతి - గుడివాడ: ది గుడివాడ మున్సిపల్ ఎంప్లాయీస్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ నెం. హెచ్ 1067 ద్వారా దానిలో సభ్యులకు రుణాలను అందజేస్తారు. సొసైటీలో శాశ్వత ఉద్యోగులతో పాటు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది సభ్యులుగా ఉన్నారు. సొసైటీ స్థానిక కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్ గుడివాడ నుంచి సొసైటీ పేరుతో భారీ రుణాలను తీసుకుని సభ్యులకు చిన్న మొత్తాల నుంచి పెద్ద మొత్తాల వరకు రుణాలుగా ఇస్తోంది. సభ్యులుగా ఉన్న వారే ఒకరికొకరు హామీగా ఉండి రుణాలను పొందుతున్నారు. ఎప్పటికప్పుడు రుణాలు తీసుకుని ప్రతి నెల తమ జీతాల నుంచి చెల్లిస్తున్నారు. ఈ ప్రక్రియ గత కొన్నేళ్లుగా కొనసాగుతోంది.

రుణాల కోసం పాత బకాయిల చెల్లింపు

గతంలో రుణాలు పొందిన వారు బకాయిలను వెంటనే చెల్లించి కొత్త రుణాలను తీసుకోవాలని సిద్ధపడ్డారు. ఈ క్రమంలో బయట వడ్డీలకు తీసుకువచ్చి సొసైటీ అకౌంట్స్ అధికారికి చెల్లించడంతో రశీదులు సైతం నిరు ఉద్యోగులను అందజేశారు. సొసైటీ సమావేశంలో రుణాలను చెల్లించిన వారికి తిరిగి కొత్త రుణాలను ఇస్తున్నట్లు ప్రకటించారు. కేడీసీసీ బ్యాంకు గుడివాడకు కొత్తగా రుణాలు తీసుకున్న వారి వివరాలు, చెల్లింపుల వివరాలను అందజేశారు. కొత్త రుణాలను పొందిన వారు పాత రుణాలను చెల్లింపునకు బయట వ్యక్తుల నుంచి తెచ్చిన మొత్తాలను కట్టేశారు. ఉద్యోగులు కొందరు పూర్తిగా బ్యాంకు రుణాలను చెల్లించారని, వారి జీతాల నుంచి రికవరీని ఆపాలని కోరుతూ సొసైటీ అధ్యక్షులు మున్సిపల్ కమిషనర్‌కు లేఖను సైతం అందజేశారు. దీంతో మున్సిపల్ అధికారులు నేడు కొత్తగా తీసుకున్న రుణాల తాలుకు కిస్తీలను జీతాల నుంచి రికవరీ చేయసాగారు. కొన్నాళ్లు సక్రమంగానే సాగింది.

కేడీసీసీ బ్యాంకును తప్పుదోవ పట్టించి..

సొసైటీ సభ్యులు పాత రుణం చెల్లించకుండానే కొత్త రుణం అందజేసి మున్సిపల్ క్రెడిట్ సొసైటీ కమిటీ కేడీసీసీ బ్యాంకును తప్పుదోవ పట్టించినట్లు సమాచారం. సుమారు రూ.5కోట్లు పాత రుణాన్ని చెల్లించకుండానే కొత్త రుణాన్ని పొందారు. పాత బకాయిలుండగా కొత్తగా మళ్లీ రుణం ఎలా ఇచ్చారనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. బ్యాంకుకు **మిగతా 2లో..**

బ్యాంకు నోటీసులతో విషయం వెలుగులోకి..

కేడీసీసీ బ్యాంకు పాత బకాయిలపై దృష్ట సారించింది. ఈ క్రమంలో మున్సిపల్ క్రెడిట్ సొసైటీ సభ్యులు నుంచి సుమారు రూ.5కోట్ల మేర బకాయిలు రావాల్సి ఉందని గుర్తించారు. వెంటనే సొసైటీకి చెందిన పాత రుణగ్రహీతలకు నోటీసులు జారీ చేశారు. ఇదే క్రమంలో మున్సిపల్ కమిషనర్‌కు మున్సిపల్ ఉద్యోగులు సొసైటీ ద్వారా తీసుకుని రుణాలను చెల్లించని వారి బకాయిదారుల జాబితాను అందజేశారు. పాత రుణాలను చెల్లించకుండానే సొసైటీ కొత్త రుణాలను ఇచ్చిందని, దీనిపై చర్యలు తీసుకోవాలని, జీతాల నుంచి రికవరీ చేయాలని బ్యాంకు అధికారులు మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. సంబంధిత గుమస్తాను పిలిచిన మున్సిపల్ కమిషనర్ ఎవరైతే బకాయిలున్నారో వారి జీతాల నుంచి రికవరీ చేయాలని ఆదేశాలిచ్చారు. విషయం తెలుసుకున్న బాధితులు లబోదిబోమంటూ మున్సిపల్ అధికారిని సంప్రదించారు. బ్యాంకు నుంచి వచ్చిన జాబితా ప్రకారం జీతాల నుంచి రికవరీకి పెట్టినట్టు సొసైటీ సభ్యులకు మున్సిపల్ అధికారులు వివరించారు.

ఎంతో కోల్పోయినాం..'

- సమస్య పరిష్కరించండి
- జిల్లాలోని ఈనాం భూ బాధితుల మొర
- రెండు జిల్లాల్లో 3,511 ఎకరాల్లో ఈనాం భూములు
- నిషేధిత భూములతో యజమానుల అష్టకష్టాలు
- రిజిస్ట్రేషన్ లేక, రుణాలు రాక ఇబ్బందులు
- ఇంకెన్నాళ్లు ఈ కష్టాలంటూ ప్రభుత్వానికి మొర
- నిషేధిత జాబితా నుంచి తొలగించాలంటూ వినతులు

- నందిగామ పట్టణంలోని సీఎం రోడ్డులో నివాసముంటున్న వీరమాచినేని కృష్ణమోహన్ తండ్రి 1974లో ఏడు సెంట్ల స్థలం కొన్నాడు. తండ్రి నుంచి కృష్ణమోహన్‌కు 3.75 సెంట్ల స్థలం వచ్చింది. ప్రస్తుతం పిల్లలిద్దరూ బీటెక్ చదువుతున్నారు. జిరాక్స్ మిషన్‌తో కాలం గడుపుతున్న ఆయన పిల్లల చదువుకు ఆర్థికంగా పలు ఇబ్బందులు పడుతున్నాడు. స్థలంలో ఉన్న పాత భవనం పెచ్చులూడుతోంది. రిజిస్ట్రేషన్ లేనందున అమ్ముదామన్నా.. కొనేందుకు ఎవరూ రావట్లేదు. రుణం తీసుకుందామన్నా బ్యాంకులు ఇవ్వట్లేదు.
- మహమ్మద్ బడేమియా సర్వే నెంబర్ 646/1సీ1లో మూడు దశాబ్దాల కిందట 2.50 ఎకరాలు కొన్నాడు. జాతీయ రహదారి విస్తరణలో అర ఎకరం పోయింది. మిగతా రెండెకరాల భూమికి దస్తావేజులు, పాసుపుస్తకం ఉన్నాయి. కూతురుకు కట్నంగా ఇచ్చిన ఆ భూమిని వారి పేరిట మార్చేందుకు వీలు పడకపోవటంతో కుటుంబపరంగా సమస్యలు తలెత్తాయి. దీంతో బడేమియా మానసికంగా కుమిలిపోతున్నాడు.


నందిగామ పట్టణం

(ఆంధ్రజ్యోతి, కంచికచర్ల) : స్వాతంత్ర్యానికి పూర్వం రాజులు, జమిందార్లు దేవాలయాలకు సేవలందించే వారి జీవనోపాధి నిమిత్తం సాగు భూము లను ఈనాం (విరాళం)గా ఇచ్చారు. స్వాతంత్ర్యం వచ్చాక రాచరిక, జమిందారీ వ్యవస్థలు రద్దు కావటంతో 1956లో ప్రభుత్వం ఇనాం చట్టాన్ని తీసుకొచ్చింది. అర్హులైన వారికి అధికారులు రైత్వారీ పట్టాలిచ్చారు. కాలక్రమేణా కొంతమంది కుటుంబ అవసరాలకు అమ్ముకున్నారు. భూములు చేతులు మారాయి. గ్రామా లు, పట్టణాలుగా విస్తరించటంతో ఎక్కువ శాతం భూము లు, స్థలాలుగా మారాయి. ఎక్కడికెక్కడ విలువైన భవనాలు, అపార్టుమెంట్లు పుట్టుకొచ్చాయి. కొత్తకొత్త కాలనీలు వెలిశాయి. పట్టణాల్లో అంతర్భాగ మయ్యాయి. అయితే, 2013లో ఈనాం భూములపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో సర్వీస్ ఈనాం భూముల రిజిస్ట్రేషన్‌ను నిలిపివేస్తూ రాష్ట్ర ప్రభుత్వం చట్ట సవరణ చేయాల్సి వచ్చింది. 2013లో అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వం ఈనాం ల్యాండ్ ఎబాలిషన్ చట్టానికి చేసిన సవరణలో చిన్న తప్పిదం వల్ల అంతా తారుమారైంది. సవరణలో విత్ ప్రాస్పెక్టివ్ ఎఫెక్ట్ అని ఉండాల్సి ఉండగా, విత్ రెట్రాస్పెక్టివ్ అని ఇవ్వటంతో 1956 ఈనాం ఎబాలిష్ యాక్టు దగ్గర నుంచి జరిగిన లావాదేవీలన్నీ నిషేధిత జాబితాలోకి వెళ్లాయి. వాస్త వానికి 2013 వరకు సర్వీసుదారులుగా ఉన్నవారికి ఈనాం భూములు చెందాలని, 2013 తర్వాత కొత్తగా ఇవ్వరాదని చట్ట సవరణ చేయగా, అక్షరం తప్పిదం వల్ల అప్పటికే రాష్ట్రంలో ఈనాం భూములు కొన్న వేలమంది చిన్న, మధ్యతరగతి కుటుంబాల వారు బాధితులయ్యారు.

ఆర్డినెన్స్‌ను తొక్కిపెట్టిన వైసీపీ

ఈనాం భూముల క్రయవిక్రయాలు నిలిచిపోవటం, రిజిస్ట్రేషన్లు లేకపోవటం వల్ల పడుతున్న ఇబ్బందులను పలువురు బాధితులు 2019లో అప్పటి సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ ఇనాం (ఎబాలిషన్ అండ్ కన్వర్షన్ ఇన్ టూ రైత్వారీ) అమెండ్‌మెంట్ ఆర్డినెన్స్-2019 పేరుతో ఆర్డినెన్స్ తీసుకొచ్చింది. దీని ప్రకారం 2013కు ముందు ఇచ్చిన పట్టాలు చెల్లుబాటు అవుతాయి. అయితే, ఈనాం సర్వీసు భూముల అంశం కేంద్ర, రాష్ట్రాలకు సంబంధించిన ఉమ్మడి జాబితాలో ఉన్నందున అప్పటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆర్డినెన్స్‌కు ఆమోదం తెలిపారు. దీనికి చట్టబద్ధత కల్పించాల్సి ఉండగా, ఈలోగా అధికారంలోకి వచ్చిన వైసీపీ పూర్తిగా పక్కన పడేసింది. చట్టబద్ధత కల్పిస్తే క్రెడిట్ అంతా చంద్రబాబుకు దక్కుతుందని జగన్ **మిగతా 2లో..**

కల్యాణం.. చూద్దాం రారండి


రాజధాని గ్రామంలోని వెంకటపాలెంలోని వేంకటేశ్వర స్వామి దేవాలయం కల్యాణోత్సవానికి సిద్ధమవుతోంది. ఈ నెల 15న శ్రీనివాసుని కల్యాణానికి టీటీడీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆరోజు టీటీడీ ఆధ్వర్యంలో సాయంత్ర 6.30 గంటల నుంచి 8.30 గంటలకు స్వామి వారి కల్యాణోత్సవం జరగనుంది.

శాస్త్ర, సాంకేతికతలో అగ్రస్థానం దిశగా.. యువభారతం

- డీఆర్డీవో మాజీ చైర్మన్ సతీష్‌రెడ్డి వెల్లడి

2లో



కృష్ణా జిల్లాలో 145 కేంద్రాల్లో నిర్వహణ

- పరీక్ష రాయనున్న 22,341 మంది: డీఈవో పీవీజే రామారావు

4లో

రంజాన్ వేళలు



ఇఫ్తార్ (సాయంత్రం): 06-21(శుక్ర)
సహర్ (ఉదయం): 04-56 (శని)



నూతిపాడు వద్ద ఎన్ఎస్‌పీ కాలువను పరిశీలిస్తున్న నీటి సంఘాల నేతలు

ఆరుతడి పంటలను రక్షించండి

» ఆళ్ల గోపాలకృష్ణ

విస్సన్నపేట/తిరువూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : సాగర్ మూడో జోన్‌కు 1500 క్యూసెక్కుల సాగునీటిని వెంటనే విడుదల చేసి 2.36 లక్షల ఆరుతడి పంటలను రక్షించాలని సాగునీటి సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణ తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం నూతిపాడు గ్రామం వద్ద ఎన్ఎస్‌పీ ఎడమ కాలువను డీసీ చైర్మన్లు, అధికారులతో కలిసి సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఎడమ కాలువకు 32 టీఎంసీల వాటా రాష్ట్రానికి ఉన్నప్పటికీ ఇప్పటి వరకు 18 టీఎంసీలు మాత్రమే తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. మానవతా దృక్పథంతో ఏప్రిల్ 15వరకు 2వేల క్యూసెక్కులను విడుదల చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కపులూరి రాజ, సగ్గుర్తి సుభాష్ చంద్రబోస్, తాళ్లూరి కిరణ్, ఏతఊలు కె.మహేష్, సునీత తదితరులు పాల్గొన్నారు.

గానుగపాడు ఎన్ఎస్‌పీ మేజర్‌కు నీరు విడుదల

మల్లేల వద్ద 101 కిలోమీటర్ రెగ్యులేటర్ వద్ద గానుగపాడు మేజర్ కాలువకు 60 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. గురువారం ఆళ్లా వెంకట గోపాలకృష్ణారావు స్థానిక నీటి సంఘాల అధ్యక్షులతో కలిసి పరిశీలించారు. ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి ఈ ప్రాంత సాగునీటి ఇబ్బందిని తెలపడంతో 234 క్యూసెక్కుల నీరు దిగువకు వస్తోందని జలాలను ఆయకట్టు రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పారిశ్రామికాభివృద్ధికి విద్యుత్ అంతరాయం రానీయకండి

» ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



అసెంబ్లీ వేదికగా

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : నగరంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న పారిశ్రామిక రంగానికి అనుగుణంగా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు గురువారం అసెంబ్లీ సమావేశాల్లో కోరారు. మల్లవల్లి పారిశ్రామిక కారిడార్‌కు నూతనంగా 220/33/11కెవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను కేటాయించాలన్నారు. జగన్ కాలనీల్లో నిరుపయోగంగా ఉన్న విద్యుత్ లైన్ల అపహరణపై చర్యలు తీసుకోవాలన్నారు. మల్లవల్లి పారిశ్రామిక కారిడార్‌లో ఇప్పటికే 53 కంపెనీలు నిర్మాణం పూర్తి చేసుకున్నాయని, రాబోయే కాలంలో 450 కంపెనీలు రానున్నాయని తెలిపారు. పారిశ్రామిక కారిడార్‌లో 33/11కెవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మాత్రమే ఉందని, దీనివల్ల తరచూ విద్యుత్ అంతరాయం కలిగి పరిశ్రమలు తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్నాయని సభ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. అందుబాటులో ఉన్న ఎసైన్డ్ భూములను సేకరిస్తే రాబోయే కాలంలో 600 పైగా పరిశ్రమలు వస్తాయని తెలిపారు.

వైకుంఠపురం బ్యారేజీ నిర్మాణం చేపట్టాలి

» ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య



జగ్గయ్యపేట : గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ప్రతిపాదించిన కృష్ణానదిపై వైకుంఠపురం బ్యారేజీ/రిజర్వాయర్ పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య అసెంబ్లీలో కోరారు. బ్యారేజీ కమ్ రిజర్వాయర్ ప్రతిపాదనలను గత ప్రభుత్వం పక్కన పడేసిందని, బ్యారేజీ నిర్మాణంతో నందిగామ, జగ్గయ్యపేట, మైలవరం ప్రాంతాలలో భూగర్భ జలాలు పెరగటంతో పాటు తాగునీటి సమస్య నివారించవచ్చని, పోలవరం పూర్తయితే బ్యాక్ వాటర్ వల్ల నాగార్జున సాగర్ ఎడమకాల్వకు సాగునీటిని అందించే అవకాశం ఉంటుందని చెప్పారు.



ఉత్సవాలకు సిద్ధమవుతున్న తిరుపతమ్మ ఆలయం

నేటి నుంచి తిరుపతమ్మ చిన్న తిరునాళ్లు

పెనుగంచిప్రోలు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఐదు రోజుల పాటు జరగనున్న తిరుపతమ్మ చిన్న తిరునాళ్ల మహోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 6 గంటలకు అఖండ జ్యోతి స్థాపనతో తిరునాళ్ల మహోత్సవాలు లాంచనంగా ప్రారంభమవుతాయని ఆలయ డిప్యూటీ కమిషనర్ కిషోర్ కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. భక్తుల సౌకర్యార్థం భారీ ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. మునేటిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు జల్లు స్నానాలు ఏర్పాటు చేశారు. తాగునీటి ఇబ్బంది లేకుండా ఆలయం చుట్టూ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రయాణికుల సౌకర్యార్థం తాత్కాలిక బస్టాండ్, ప్రత్యేక వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఆలయ ఈఈ ఎల్.రమా, తహసీల్దార్ శాంతిలక్ష్మి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. విజయవాడ రూరల్ డీసీపీ మహేశ్వరరాజు బందోబస్తు ఏర్పాట్లపై పోలీసులకు పలుసూచనలు చేశారు.



మొల్లమాంబ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

మొల్ల సాహిత్యం చిరస్మరణీయం

» కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : రామాయణాన్ని సంస్కృతం నుంచి తెలుగు భాషలోకి అనువదించిన తొలి తెలుగు మహిళా కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ (మొల్ల) సాహిత్య సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోతాయని, మొల్ల జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. మొల్ల జయంతి సందర్భంగా గురువారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధ్వర్యంలో మొల్ల జయంతి వేడుకలకు కలెక్టర్ లక్ష్మీశ ముఖ్య అతిథిగా హాజరై ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మొల్ల చిరుప్రాయంలోనే శ్రీరామ చరిత్రను వచన కావ్యంగా రచించారన్నారు. తెలుగు సాహిత్య రంగానికి మొల్లమాంబ చేసిన సేవలు, తేట తెలుగు పద్యకావ్యం మొల్ల రామాయణం, ఆమె వర్ణనా మాధుర్యం తదితరాలను స్మరించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మొల్లమాంబ జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. రెవెన్యూ అధికారి ఎం.లక్ష్మీనరసింహం, ఏవో ఎస్.శ్రీనివాసరెడ్డి, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారి జి.మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్ర, సాంకేతికతలో అగ్రస్థానం దిశగా..

యువభారతం



గోరా టెక్నోహబ్‌ను తిలకిస్తున్న విద్యార్థినులు

» ఉన్నత విద్యలో 4.38 కోట్ల మంది, లక్షా 62వేల రిజిస్టర్ స్టార్టప్‌లు

» డీఆర్డీవో మాజీ చైర్మన్ సతీష్‌రెడ్డి వెల్లడి



మాట్లాడుతున్న సతీష్‌రెడ్డి

బెంజిసర్కిల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు, యువత శాస్త్ర, సాంకేతిక విషయాల్లో ఆసక్తి కనబరిస్తే భారత్ ప్రపంచంలోనే అగ్రగామి అవుతుందని డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్(డీఆర్‌డీవో) మాజీ చైర్మన్, ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు జి.సతీష్‌రెడ్డి అన్నారు. స్థానిక నాస్తిక కేంద్రంలో ఏర్పాటుచేసిన గోరా 'టెక్నోహబ్‌'ను గురువారం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, డాక్టర్ సమరంతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సతీష్‌రెడ్డి మాట్లాడుతూ, ఇటీవల భారత్‌లో వినూత్న మార్పులు వచ్చాయని, దేశంలో నేడు ఉన్నతవిద్యను అభ్యసించేవారి సంఖ్య 4.38 కోట్లకు చేరిందన్నారు. ఈ సంఖ్య ప్రపంచంలోని చాలా దేశాల్లో జనాభా సంఖ్య కంటే ఎక్కువగా ఉందని తెలిపారు. మన దేశం సంవత్సరానికి 14 లక్షల మంది ఇంజనీర్లను తయారుచేస్తుందని, రీసెర్చ్ పబ్లికేషన్స్, పీహెచ్‌డీ చేసేవారి సంఖ్యలో భారత్ ప్రపంచంలో మూడోదిగా ఉందన్నారు. నేడు ప్రభుత్వం వద్ద రిజిస్టర్ అయిన స్టార్టప్‌లు లక్షా 62వేలు ఉన్నాయని ఆయన చెప్పారు. వీటిలో 95 శాతం యువత చేసినవేనన్నారు. ప్రపంచమంతా భారత్ స్టార్టప్‌ల వైపు చూస్తున్నదన్నారు. త్వరలో ఇస్రో సొంతంగా స్పేస్‌స్టేషన్ పెట్టనున్నట్టు తెలిపారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, విద్యార్థులు గోరా టెక్నోహబ్‌ను సందర్శించి శాస్త్ర, సాంకేతిక రంగాలపై అవగాహన పెంచుకోవాలని కోరారు. గోరా టెక్నోహబ్ చైర్మన్ డాక్టర్ సమరం మాట్లాడుతూ, టెక్నోహబ్‌లో హ్యూమనైడ్ రోబోను గైడ్‌గా ఏర్పాటు చేయడమే కాకుండా రోబోటిక్ సైన్స్ అండ్ టెక్నాలజీతో కష్టతరమైనవి ఎంత సులభంగా చేయవచ్చో కళ్లకు కట్టినట్టు ఆవిష్కరణలను ఏర్పాటుచేశామని పేర్కొన్నారు. అంతరిక్షశాల, అందులో చంద్రయాన్-3 శాటిలైట్, చంద్రుడిపై రోవర్ ప్రయాణం, స్పేస్‌షిప్స్, అంతరిక్షం నుంచి సంకేతాలు ఇలాంటి ఎన్నో ఆసక్తికర అంశాలను ఏర్పాటుచేశామని ఆయన వివరించారు. కార్యక్రమంలో కలెక్టర్ జి.లక్ష్మీశ, వ్యవసాయశాఖ డైరెక్టర్ ఎస్.ఢిల్లీరావు, గోరా సైన్స్ సెంటర్ డైరెక్టర్ నియంత తదితరులు పాల్గొన్నారు.



గోరా టెక్నోహబ్ ప్రదర్శనను పరిశీలిస్తున్న డీఆర్‌డీవో మాజీ చైర్మన్ సతీష్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, డాక్టర్ సమరం ఉన్నారు

ధాన్యం సేకరణకు సిద్ధం కావాలి

» రైతు ప్రయోజనాలే లక్ష్యంగా కార్యాచరణ : కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం సేకరణ ప్రక్రియ పూర్తియిందని, ఇదేవిధంగా రబీ (2024-25) సీజన్ ధాన్యం కొనుగోలుకు పటిష్ఠ ప్రణాళికతో సన్నద్ధంగా వుండాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. గురువారం పౌరసరఫరాల కమిషనర్ సౌరబ్‌గౌర్, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ లిమిటెడ్ వీసీ, ఎండీ మంజీర్ జిలానీ, రబీ ధాన్యం సేకరణ సన్నద్ధతపై వర్క్‌షాపుతో పాటు ఎంఎల్ఎస్ పాయింట్ల ఇన్‌స్పెక్షన్ మాడ్యూల్, బఫర్ గోదాముల వినియోగం, కాగిత రహిత డిజిటల్ లావాదేవీలు తదితరాలపై వర్చువల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి కలెక్టర్ లక్ష్మీశ, పౌరసరఫరాలు, వ్యవసాయ, సహకార, రవాణా తదితర శాఖల అధికారులు హాజరయ్యారు. రబీ ధాన్యం సేకరణ సజావుగా జరిగేలా చేపట్టాల్సిన చర్యలపై వీసీ, ఎండీ మంజీర్ జిలానీలు పలు సూచనలు చేశారు. అదేవిధంగా ప్రజాపంపిణీ వ్యవస్థలో ఈ-కేవైసీ తదితర అంశాలను సౌరబ్ గౌర్ వివరించారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ, ఖరీఫ్‌కు సంబంధించి 149 రైతు సేవాకేంద్రాల ద్వారా 16,353 మంది రైతుల నుంచి సుమారు రూ.257 కోట్ల 1,10,738 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించడం జరిగిందని, ఇదేవిధంగా రబీకి కూడా సిద్ధంగా వుండాలన్నారు. జిల్లాలో ఈ-పంట నమోదు ఆధారంగా చూస్తే రబీలో 20,422 హెక్టార్లలో వరివేయడం జరిగిందని, 1,60413 మెట్రిక్ టన్నుల మేర ధాన్యం ఉత్పత్తి అయ్యే అవకాశముందని తెలిపారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో వుంచుకొని మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేసేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికతో సిద్ధంగా వుండాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రబీ ధాన్యం సేకరణకు జిల్లాస్థాయిలో జేసీ చైర్మన్‌గా ఆర్డీవోలు, పౌరసరఫరాల డీఎం, డీఎస్‌వో, డీఏవో తదితర అధికారులు సభ్యులుగా కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వివిధ శాఖల అధికారులు క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకొని పనిచేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో డీఆర్‌వో ఎం.లక్ష్మీ నరసింహం, పౌరసరఫరాల డీఎం ఎం.శ్రీనివాసు, డీఎస్‌వో ఎ.పాపారావు, జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, జిల్లా సహకార అధికారి ఎస్.శ్రీనివాసరెడ్డి, ఆర్డీవో ఆర్.ప్రవీణ్, జిల్లా అగ్రిగ్రేడ్ అండ్ మార్కెటింగ్ అధికారి కె.మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

పని భారం తగ్గించండి : కలెక్టర్‌కు వీఆర్వోల వినతి

కలెక్టరేట్ : సచివాలయాల రేషనలైజేషన్ ప్రక్రియలో భాగంగా వీఆర్వోలకు జరుగుతున్న నష్టంపై ఆ సంఘం అధ్యక్షుడు రాటకొండ శ్రీనివాసరావు గురువారం కలెక్టర్ లక్ష్మీశ దృష్టికి తీసుకెళ్లారు. పనిఒత్తిడి భారాన్ని తగ్గించి, వేరే డిపార్ట్‌మెంట్ల వర్క్‌ని వీఆర్‌వోలకు ఇవ్వడం వలన గ్రామాల్లో రీ సర్వే, రెవెన్యూ పనులు ఆగిపోతున్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వీటన్నిటిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.

అన్నా క్యాంటీన్‌లో మెనూ తప్పనిసరి

» నిర్వహణలో ఇబ్బంది లేకుండా నిరంతర పర్యవేక్షణ

» వన్‌టౌన్‌లో కలెక్టర్ లక్ష్మీశ ఆకస్మిక తనిఖీ

ఎన్టీఆర్ కలెక్టరేట్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి ఆకాంక్షకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన అన్నా క్యాంటీన్‌లలో మెనూ ఖచ్చితంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవడం జరిగిందని, అదేవిధంగా నిర్వహణపరంగా ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా నిరంతర పర్యవేక్షణ వుంటుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. కలెక్టర్ గురువారం విజయవాడ అర్బన్, వన్‌టౌన్ గాంధీ మహిళా కళాశాల వద్ద అన్నా క్యాంటీన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. టోకెన్ కౌంటర్, డైనింగ్ ఏరియాతో పాటు స్వచ్ఛమైన తాగునీటి ఏర్పాట్లు, మరుగుదొడ్లు తదితరాలను పరిశీలించారు. భోజనం నాణ్యత ఎలా వుందో అక్కడికి వచ్చిన వారిని అడిగి తెలుసుకున్నారు. మంచి ఆహ్లాదకర, పరిశుభ్రమైన వాతావరణంలో పేదలు భోజనం చేసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ఆకలితో ఉన్నవారికి పట్టెడన్నం పెట్టడం ద్వారా ఎంతో సంతృప్తి సొంతమవుతుందని, ఇలాంటి ఓ మంచి కార్యక్రమంలో భాగమవుతున్న సిబ్బంది నిబద్ధత, సేవా దృక్పథంతో సేవలు అందించాలని సూచించారు. అన్నిచోట్లా అన్నా క్యాంటీన్‌లో అవసరమైన మౌలిక వసతులు కల్పించినట్టు తెలిపారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్యాంటీన్ల నిర్వహణకు ప్రత్యేకంగా ఇన్‌చార్జిలకు బాధ్యతలు అప్పగించడం జరిగిందని కలెక్టర్ పేర్కొన్నారు.



వన్‌టౌన్‌లోని అన్నా క్యాంటీన్‌లో ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

కొండవాగులో ఆక్రమణలు తొలగించాల్సిందే..

» 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి స్పందించిన అధికారులు

» ప్రతిరోజు నివేదికలు పంపండి

» తహసీల్దార్‌కు ఆర్డీవో ఉత్తర్వులు

గుణదల, మార్చి 13(ఆంధ్రజ్యోతి) : 'కొండవాగులో కబ్జాకోరులు' 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ఈనెల 6న ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఆర్డీవో కావూరి చైతన్య 'కొండవాగు' ప్రాంతాన్ని పరిశీలించి నివేదిక పంపాలని విజయవాడ రూరల్ తహసీల్దార్‌ను ఆదేశించారు. ఇదే విషయమై రెవెన్యూ అధికారులు స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయాలని చెప్పడంతో ఆక్రమణకు పాల్పడిన వ్యక్తులపై పాయకాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ నివేదిక ఆధారంగా ఈనెల 11న తాజాగా ఆర్డీవో కావూరి చైతన్య ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్ఎస్ నెంబరు 151-2 ఆక్రమిత ప్రాంతంలో నిర్మాణాలు తొలగించాల్సిందేనని, అక్కడ జరుగుతున్న కార్యక్రమాలపై రోజుకు మూడుసార్లు ఫొటోలు తీసి ఆర్డీవో కార్యాలయానికి నివేదించాలని సదరు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఇది కొనసాగాలన్నారు.

బిట్ కాయిన్ పేరుతో ఘరానా మోసం!

» వృద్ధుడి నుంచి పలు దఫాలుగా రూ.కోటి వసూలు

విద్యాధరపురం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): బిట్‌కాయిన్ వ్యాపారం చేస్తే మంచి లాభాలు వస్తాయని మాయమాటలు చెప్పి విద్యాధరపురానికి చెందిన ఓ వృద్ధుడి నుంచి రూ.కోటి వసూలు చేసి మోసం చేసిన ప్రధాన సూత్రదారుడితో పాటు మరో ఇద్దరిపై గురువారం భవానీపురం స్టేషన్‌లో కేసు నమోదైంది. నాలుగుస్తంభాల సెంటర్‌కు చెందిన బళ్ల శ్రీనివాసరావు (61) కుటుంబసభ్యులతో కలిసి ఉంటున్నాడు. 2019 అక్టోబరులో వ్యక్తిగత పనులపై విశాఖపట్నం వెళ్లాడు. అక్కడ కోంబత్తుల కృష్ణ సతీష్ పరిచయమయ్యాడు. మాటల సందర్భంలో తాను బిట్‌కాయిన్ వ్యాపారం చేస్తున్నానని, మంచి లాభాలు వస్తున్నాయని శ్రీనివాసరావును నమ్మించాడు. అతడి నమ్మిన శ్రీనివాసరావు దఫ దఫాలుగా కోటిరూపాయలు అతడికి ముట్టజెప్పాడు. కొన్నిరోజుల తరువాత కృష్ణ సతీష్ తాను బిట్‌కాయిన్ కొన్నానని, చాలా లాభం వచ్చిందని శ్రీనివాసరావుకు తెలిపాడు. అయితే డబ్బులు ఇవ్వకుండా కాలయాపన చేయడంతో అతడి మిత్రులు పులిప్రసాద్, చంద్రశేఖర్‌లకు తనకు జరిగిన అన్యాయం గురించి శ్రీనివాస్ తెలిపాడు. కృష్ణసతీష్ నుంచి డబ్బులు ఇప్పిస్తామని, వారిద్దరు శ్రీనివాస్‌ను కాకినాడకు పిలిపించారు. నాటి కాకినాడ అదనపు ఎస్పీ రఘువీరారెడ్డి వద్దకు కృష్ణ సతీష్‌ను పిలిపించి ఐదు కోట్ల రూపాయలు వసూలు చేశామని, వాటిలో నుంచి తన నగదు మొత్తం ఇస్తామని శ్రీనివాస్‌కు నమ్మబలికారు. అంతేకాక శ్రీనివాస్, అతని సోదరులను మూడు నెలలపాటు కాకినాడలోనే ఉంచారు. అయినా డబ్బులు ఇవ్వకపోవడంతో బాధితుడు గురువారం భవానీపురం పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంట్లో భద్రపరిచిన 130 గ్రా బంగారం చోరీ!

ఇమాం పంజా వీధిలో ఓ ఇంట్లో పదిలపరచిన 130 గ్రాముల బంగారం చోరీకి గురైంది. ఈమేరకు వన్‌టౌన్ స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. వివరాల మేరకు.. భవానీపురం పెట్రోల్ బంకు సమీపంలోని కాలిబర్ ఉత్సవ్ అపార్ట్‌మెంట్లో ముఖేష్ కుమార్ పురోహిత్ కుటుంబసభ్యులతో ఉంటున్నాడు. గత పదేళ్లగా వన్‌టౌన్ మఠం వీధిలో మన్ మందిర్ జ్యూయలరీ పేరుతో నగల వ్యాపారం చేస్తున్నాడు. ఇతడి వద్ద మనీష్ గోస్వామి, సంజయ్‌లు పనిచేస్తున్నారు. వీరికోసం ఇమాం పంజా వీధిలో ఒక ఇంటిని అద్దెకు తీసుకున్నాడు. ఈ క్రమంలో ముఖేష్‌కుమార్ పురోహిత్ వ్యక్తిగత పనుల నిమిత్తం ఈనెల 5న రాత్రి ఆగ్రా వెళుతూ సుమారు 130 గ్రాముల బంగారాన్ని చిన్నబాక్సులో పెట్టి ఇద్దరు పనివారు ఉంటున్న ఇంట్లో భద్రపరిచాడు. మరుసటి రోజు ఇద్దరు పనివారు వ్యాపార నిమిత్తం ఇంటికి తాళం పెట్టి గుంటూరు వెళ్లారు. ఆ రోజు రాత్రి తిరిగి ఇంటికి వచ్చి చూడగా తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లోచూడగా 130 గ్రాముల బంగారం చోరీకి గురైనట్టు గుర్తించారు. ఆగ్రా నుంచి గురువారం తిరిగి వచ్చిన ముఖేష్ కుమార్ పురోహిత్ జరిగిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వైఎస్సార్ తాడిగడప మునిసిపల్ అధికారులపై చర్యలకు సిఫార్సు

» అనుమతులు లేకుండా భవనాల నిర్మాణం చేసినా పట్టించుకోని వైనం

» రాజమండ్రి టౌన్ ప్లానింగ్ అధికారుల విచారణలో వెల్లడి

పెనమలూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : తాడిగడప వైఎస్సార్ తాడిగడప పురపాలకసంఘంలో ఎలాంటి అనుమతులు లేకుండా భవనాలను నిర్మాణం చేసినా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్‌కుమార్ ఈనెల 11న ఉత్తర్వులు జారీచేశారు. దీంతో అక్రమనిర్మాణాలు చేసినా వివిధ కారణాలతో మిన్నకుండపోయిన అధికారులపై వేటు వేసేందుకు రంగం సిద్ధమైంది. వివరాలు ఇలా ఉన్నాయి.. విజయవాడ సమీపంలో వైఎస్సార్ తాడిగడప పురపాలకసంఘంలో ఎలాంటి అనుమతులు లేకుండా భవనాల నిర్మాణం చేశారని, ఈ అంశంపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని తాడిగడపకు చెందిన ఎం.వేణుగోపాలరావు రాజమండ్రి టౌన్ అండ్ కంట్రీప్లానింగ్‌శాఖ డైరెక్టర్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ అంశంపై రాజమండ్రి డిప్యూటీ డైరెక్టర్‌ను విచారణ అధికారిగా నియమించారు. ఈ వ్యవహారంపై విచారణ చేసిన డిప్యూటీ డైరెక్టర్ పురపాలకసంఘం పరిధిలో చిటిరాల కోటేశ్వరరావు అనే వ్యక్తి గ్రౌండ్‌ఫ్లోర్‌తో పాటు, దానిపై మూడు అంతస్థులను ఎలాంటి అనుమతులు లేకుండా వేర్వేరు ప్రాంతాల్లో రెండు భవనాలను నిర్మాణం చేశారని నివేదిక రూపొందించారు. అదే పురపాలకసంఘంలో గాదె నాగేశ్వరరావు, కాశీవిశాలాక్షి పేర్లతో గ్రౌండ్‌ఫ్లోర్‌తో పాటు 4అంతస్తులు, పెంట్‌హౌస్ ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణం చేసినట్టు అధికారులు గుర్తించారు. తీసుకున్న ప్లాన్‌కు, నిర్మాణాలకు పొంతనలేదని అధికారులు తేల్చారు. అనుమతులు లేకుండా భవనాల నిర్మాణం చేసినా టౌన్‌ప్లానింగ్ అధికారి వై.పద్మావతి, ఏసీపీ మురళీ గౌడ్, కమిషనర్ ఎం.వేణుగోపాలరావు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారని, అధికారుల పనితీరులో పలు లోపాలున్నాయని సూచిస్తూ, వారిపై శాఖాపరంగా క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు సిఫార్సు చేశారు. దీంతో ప్రభుత్వం వైఎస్సార్ తాడిగడప పురపాలక సంఘం అధికారులపై చర్యలకు ఆదేశాలు జారీ చేసింది.

రూ.5 కోట్లు హాంఫట్!

(1వ పేజీ తరువాయి)

అందించిన జాబితాలో గోల్‌మాల్ చేశారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీని వెనుక సొసైటీ కమిటీ, బ్యాంకు ఉద్యోగుల పాత్ర ఎంత ఉందనే అనుమానాలు ఉన్నాయి. ఒక్కో ఉద్యోగి పేరున సుమారు రూ.4 లక్షల నుంచి రూ.5లక్షల వరకు బకాయి ఉన్నట్లు సమాచారం.

సొసైటీ అకౌంటెంట్ పాత్ర ఎంత?

పాత రుణం తాలుకు మొత్తాన్ని తాము సొసైటీకి చెందిన ప్రైవేటు అకౌంట్స్ అధికారికి చెల్లించామని, రుణవిముక్తులయినట్లు రశీదులు కూడా అందుకున్నామని చిరు ఉద్యోగులు స్పష్టం చేశారు. అయితే అకౌంటెంట్ సదరు మొత్తాన్ని బ్యాంకునకు చెల్లించకుండా సొసైటీ రికార్డుల్లో ట్యాంపరింగ్ చేశారనే ఆరోపణలున్నాయి. రుణగ్రహీతలు కట్టిన మొత్తం ఏమైందనే సందేహం వ్యక్తమవుతుంది. ఎవరి జేబుల్లోకి వెళ్లిందో తేలాల్సి ఉంది.

ఎంతో కోల్పో'యినాం..'

(1వ పేజీ తరువాయి)

ఆమోదముద్ర వేయలేదు. దీంతో ఆర్డినెన్స్‌కు కాలం చెల్లింది. బాధితులు పలుమార్లు విన్నవించినప్పటికీ పెడచెవిన పెట్టారు. దీంతో ఇనాం భూముల సమస్య మళ్లీ మొదటికొచ్చింది.

ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఇలా..

ఉమ్మడి కృష్ణాజిల్లాలో 3,511.88 ఎకరాల ఇనాం భూములున్నాయి. నందిగామలో 650 ఎకరాలు, జగ్గయ్యపేటలో 400 ఎకరాలు ఉన్నాయి. ఈ రెండు పట్టణాల్లో కలిపి 16 వేల మందికిపైగా బాధితులు ఉన్నారు. పుష్కర కాలంగా వారంతా ఇబ్బంది పడుతున్నారు. పిల్లల చదువులకు, పెళ్లిళ్లకు, వైద్యానికి, ఇతరత్రా కుటుంబ అవసరాలకు అమ్ముకునేందుకు వీలుపడని దుస్థితి నెలకొంది. ఏదో ఒక ధరకు అమ్ముదామనుకున్నా రిజిస్ట్రేషన్ లేనందున కొనేందుకు ఎవరూ ముందుకు రావట్లేదు. తాకట్టు పెట్టుకుని రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు సైతం ముందుకు రావట్లేదు. ఆ భూములన్నీ నిషేధ జాబితా 22 (ఏ) (1)(సీ)లో ఉన్నాయి. నిషేధ జాబితా నుంచి తొలగించాలని బాధితులు కోరుతున్నారు. రెవెన్యూ అధికారులు, కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, మంత్రులను కలిసి వినతులు ఇస్తూనే ఉన్నారు. రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా దృష్టికి కూడా తీసుకెళ్లారు. మంత్రి నారా లోకేశ్, సీఎం చంద్రబాబును సైతం కలిసి తమ గోడు చెప్పుకొన్నారు. సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. అసెంబ్లీ సమావేశాల్లో జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య ప్రస్తావించారు. పరిష్కరించాల్సిందిగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

బాధితులకు న్యాయం చేయండి

- రాటకొండ రామకోటేశ్వరరావు, రాష్ట్ర ఇనాం భూముల బాధితుల సంఘం నాయకుడు

12 ఏళ్లగా అష్టకష్టాలు పడుతున్నాం. ఇప్పటికే ఒకటికి పదిసార్లు రిజిస్ట్రేషన్లు జరిగిన భూములు, స్థలాలు కూడా నిషేధిత జాబితాలో ఉన్నాయి. వైసీపీ హయాంలో జగన్ సమస్యను పరిష్కరించకుండా కాలయాపన చేశారు. ఆర్డినెన్స్‌కు కావాలనే చట్టబద్ధత కల్పించలేదు. కూటమి ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నాం. సీఎం చంద్రబాబు పెద్దమనసుతో నిషేధజాబితాను తొలగించి, బాధితులకు న్యాయం చేయాలి.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	90, 97, 107
చికెన్ విత్ స్కిన్	170
చికెన్ స్కిన్‌లెస్	180

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

అయ్యప్పస్వామి జన్మనక్షత్ర మహోత్సవాలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి) : కోడూరుపాడు కోదండరామస్వామి దేవస్థాన ఆవరణలో అయ్యప్ప స్వామి జన్మనక్షత్ర మహోత్సవాలు శుక్రవారం నిర్వహించనున్నట్లు వైస్ ఎంపీపీ చందు రమాదేవి, శ్రీనివాసరావు దంపతులు గురువారం తెలిపారు.

శిథిలావస్థలో వంతెనలు

(ఆంధ్రజ్యోతి - ఉంగుటూరు): మండలంలో దశాబ్దాల క్రితం నిర్మించిన పలు వంతెనలు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయి. వంతెనలకు దిగువన గోడలకు బీటలు ఏర్పడటంతో ఎప్పుడు, ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు, రైతులు భయాందోళనలకు గురవుతున్నారు. పెదఅవుటపల్లిలోని ఏలూరు కాల్వపై సుమారు శతాబ్దకాలం కిందట నిర్మించిన వంతెన శిథిలస్థితికి చేరింది. కొన్నేళ్ల క్రితం వంతెన మధ్యలో సుమారు 20 మీటర్ల మేర శ్లాబుకు గుంతలు పడి ప్రమాదకరంగా మారడంతో అధికారులు యుద్ధప్రాతిపదికన ఫ్లోరింగ్ పనులు చేపట్టి వంతెన శ్లాబును పటిష్ఠం చేశారు. వంతెనకు దిగువన నిర్మించిన రాతిగోడలు పలుచోట్ల పగుళ్లిచ్చి దెబ్బతినడంతో ఈ వంతెన పైనుంచి బైక్‌లు, ఆటోలు, ట్రాక్టర్లపై పొలాల్లోకి నిత్యం రాకపోకలు సాగించే రైతులు, వ్యవసాయ కూలీలు బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సిన పరిస్థితి. ముఖ్యంగా రైతులు తాము పండించిన పంట ఉత్పత్తులను వివిధ వాహనాల్లో తరలించేందుకు ఈ వంతెన ప్రధాన మార్గంగా వుంది. ఆర్ అండ్ బీ, ఇరిగేషన్‌శాఖ అధికారులు స్పందించి ప్రమాదం జరగక ముందే మేల్కొని కాలం చెల్లిన వంతెన స్థానంలో నూతన వంతెన నిర్మాణం చేపట్టాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.



పెదఅవుటపల్లిలో ఏలూరుకాల్వ వంతెనకు దిగువన బీటలు



వంతెన మధ్యలో శ్లాబుపై ఫ్లోరింగ్‌పై గోతులు

ప్రతిపాదనలు పంపాం

శిథిలావస్థకు చేరిన పాత వంతెనల స్థానంలో కొత్త వంతెనల నిర్మాణాలు చేపట్టేందుకు ప్రభుత్వం సుముఖంగా వుంది. ఇందులో భాగంగా రూ.30 కోట్లతో పెదఅవుటపల్లి వద్ద ఏలూరు కాల్వపై నూతన బ్రిడ్జి నిర్మాణం, రూ.30 లక్షలతో ఉంగుటూరువద్ద మురుక్కోడుపై నూతన వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం.

ఈ శ్రీహరి ,ఆర్ అండ్‌బీ ఏఈ

మురుక్కోడుపై వంతెన..

ఉంగుటూరు నుంచి వయా పొణుకుమాడు మీదుగా ఆత్కూరు వెళ్లే రోడ్డులో మురుక్కోడుపై ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరి ప్రమాదాలకు నెలవుగా మారింది. వంతెనకు ఇరువైపులా రెయిలింగ్ లేకపోవడం, అప్రోచ్‌రోడ్డు కోతకు గురై గొయ్యి ఏర్పడటం, వంతెన వద్ద రోడ్డు ప్రమాదకర మలుపు వుండటంతో రాత్రివేళల్లో ప్రయాణాలు సాగించే వాహనదారులు అదుపుతప్పి కాలువలో పడి ఆస్పత్రి పాలవుతున్నారు. పాత వంతెన కావడంతో శ్లాబు దిగువన రాతిగోడలు నెర్రలిచ్చి బలహీనంగా మారాయి. కూటమి పాలకులు స్పందించి శిథిలమైన పాత వంతెన స్థానంలో నూతన వంతెన నిర్మాణం చేపట్టి ప్రమాదాల బారినుంచి రక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల స్వీకరణ

హనుమాన్‌జంక్షన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి పథకంలో లబ్ధి పొందేందుకు బీసీ, ఈబీసీ వర్గాలకు ఆయా కార్పొరేషన్ల నుంచి సబ్సిడీ రుణాలు పొందడానికి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు బాపులపాడు ఎంపీడీవో కె.జోగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హతలున్న వారు apobmms.apcfss.in వెబ్ సైట్ లో పేర్లు నమోదు చేసుకోవాల్సిందిగా కోరారు.

పది పరీక్షలకు ఏరాట్లు పూర్తి

హనుమాన్‌జంక్షన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 17 నుంచి ఏప్రిల్ 1 వరకు జరగనున్న పదవ తరగతి పరీక్షలకు బాపులపాడు మండలంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవో రాంబాలసింగ్ గురువారం తెలిపారు. మండలంలో ఆరు కేంద్రాల్లో 860 మంది రెగ్యులర్, 100 మంది సప్లిమెంటరీ విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. అన్ని కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించినట్లు ఎంఈవో పేర్కొన్నారు.

పీ-4 సర్వే వేగవంతం చేయాలి

హనుమాన్‌జంక్షన్, మార్చి13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం దిశానిర్దేశం చేసిన పీ-4 సర్వేను వేగవంతం చేయాలని బాపులపాడు ఎంపీడీవో కె. జోగేశ్వరరావు పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పీ-4, ఎంఎస్ఎంఈ, హౌస్‌హోల్డు సర్వే, చిన్న పిల్లల ఆధార్ నమోదు కార్యక్రమాల నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీవో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈవోపీఆర్డీ లక్ష్మయ్య, మండల పరిషత్ ఏవో త్రినాథ్‌రావు పాల్గొన్నారు.

మండలపరిషత్ సమావేశం 16న

గన్నవరం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 16వ తేదీ ఉదయం 10 గంటలకు వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్ అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో టి.స్వర్ణలత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీ సభ్యులతో పాటు సర్పంచ్‌లు, పీఏసీఎస్ అధ్యక్షులు, అన్ని శాఖల అధికారులు పాల్గొనాల్సిందిగా కోరారు.

వైభవంగా లక్ష్మీ తిరుతమ్మ తిరునాళ్లు

పెనమలూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : కానూరు గోపయ్య సమేత లక్ష్మీతిరుమతమ్మ తల్లి తిరునాళ్ల గురువారం వైభవంగా నిర్వహించారు. కానూరు, చుట్టుప్రక్కల గ్రామాల భక్తులు గోపయ్య, లక్ష్మీతిరుపతమ్మలను దర్శించుకోవడానికి తరలివచ్చారు. ఉదయాన్నే అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామ ప్రభను ప్రత్యేకంగా అలంకరించి శోభన్ బ్రదర్స్ ఆధ్వర్యంలో ఊరేగించారు. శోభన్ బ్రదర్స్ ఆధ్వర్యంలో అన్నసంతర్పణ నిర్వహించారు. సీఐ వెంకటరమణబందోబస్తు నిర్వహించారు.

గన్నవరంలో..

గన్నవరం : పాత గన్నవరం లక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో గురువారం రాత్రి అమ్మవారి వార్షిక చిన కల్యాణం ఘనంగా నిర్వహించారు. తిరుపతమ్మకు పంచామృతాలతో అభిషేకాలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని మానుకు పూజలు చేసి పాల పొంగళ్లు సమర్పించారు. రాత్రి 7 గంటలకు లక్ష్మీ తిరుపతమ్మ సమేత గోపయ్య స్వామిలకు వేద పండితులు శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. కాసర్నేని వెంకటేశ్వరరావు (నాని), స్వరాజ్య ధనలక్ష్మీ దంపతులు కన్యాదాతలుగా వ్యవహరించి కల్యాణ మహోత్సవాన్ని జరిపారు. తిరుపతమ్మ మాతృ మండలి సభ్యుల కోలాట నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

ట్రూ అప్ చార్జీలు తగ్గించాలి

ఉయ్యూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ బిల్లుల్లో ట్రూఅప్ చార్జీలు వెంటనే తగ్గించాలని సీపీఎం ఉయ్యూరు పట్టణ కార్యదర్శి బి.రాజేశ్ డిమాండ్ చేశారు. సీపీఎం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా 16వ వార్డులో గురువారం పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. విద్యుత్ బిల్లుల్లో సర్దుబాబు, ఇతర చార్జీల రూపంలో వినియోగించిన యూనిట్ల మొత్తంతో సమానంగా ముక్కుపిండి వసూలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వీరయ్య, వెంకయ్య, దుర్గారావు పాల్గొన్నారు.

ఘనంగా హోలీ

పెనమలూరు, మార్చి13 (ఆంధ్రజ్యోతి): పోరంకి టీడీపీ కార్యాలయంలో గురువారం హోలీ పండుగ ఘనంగా నిర్వహించారు. మండలంలోని యనమలకుదురు, పెనమలూరు, పోరంకి, తాడిగడప ప్రాంతాల నుంచి వందల మంది తెలుగు మహిళలు, తెలుగు తమ్ముళ్లు తరలివచ్చి ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలిపారు. డీజే నృత్యాలు చేసి ఆనందాన్ని పంచుకొన్నారు. తెలుగు మహిళలతో ఎమ్మెల్యే బోడె, తాడిగడప గ్రామ టీడీపీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు నృత్యాలు చేసి చిందేయటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వేడుకలకు వచ్చిన టీడీపీ మహిళామణులకు ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు కోయ ఆనంద్ ప్రసాద్,తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి బోడె మనోజ్, చిన్నారి, ఆచంట వెంకటచంద్ర, కొమ్మినేని వెంకటేష్, కొమ్మినేని వాసు, గోపీచంద్, శ్రీనివాస్, చక్రవర్తి, అబ్రహం ,తదితరులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి



ఉంగుటూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : చెన్నై-కోల్‌కతా జాతీయరహదారిపై ఆత్కూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందాడు. విజయనగరం జిల్లా విప్పలవలస గ్రామానికి చెందిన జామి శ్రీనివాసరావు(60)వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె వున్నారు. తన సోదరుడు జామి మహేశ్వరరావు(49)తో కలిసి బుధవారం గుడ్లవల్లేరులో వున్న తన మేనల్లుడి కుమార్తె ఓణీల ఫంక్షన్‌కు వెళ్లారు. సాయంత్రం 5 గంటలకు ఆత్కూరులోని తన బంధువుల ఇంటికి వచ్చారు. తిరిగి రాత్రి 9.45 గంటలసమయంలో స్వగ్రామానికి వెళ్లేందుకు ఇరువురు కలిసి రోడ్డు దాటుతుండగా విజయవాడ నుంచి ఏలూరు వైపు వెళ్తున్న ఇన్నోవా కారు జామి శ్రీనివాసరావు(60)ని ఢీకొట్టింది. ఈప్రమాదంలో శ్రీనివాసరావు రెండుకాళ్లు విరిగి, తలకు తీవ్రగాయం కాగా మహేశ్వరరావు త్రుటిలో తప్పించుకున్నాడు. తీవ్రంగా గాయపడిన శ్రీనివాసరావును చిన అవుటపల్లిలోని పిన్నమనేని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఏఎస్సై రామారావు కేసు నమోదుచేసి దర్యాప్తుచేపట్టారు. గురువారం మృతదేహానికి గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్ట్‌మార్టమ్ నిర్వహించి బంధువులకు అప్పగించారు.

పంచాయితీ కార్యదర్శులకు పనిభారం తగ్గించాలి

గన్నవరం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శులు ఎదుర్కొంటున్న అధిక పని భారం, పని ఒత్తిడిని తగ్గించాలని కార్యదర్శుల అసోసియేషన్ అధ్యక్షురాలు సరోజిని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో టి.స్వర్ణలతను కలిసి పంచాయతీ కార్యదర్శులు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. సరోజిని మాట్లాడుతూ పంచాయ కార్యదర్శులు వివిధ రకాల సర్వేలు, ప్రభుత్వ నిర్దేశిత కార్యక్రమాలతో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని చెప్పారు. సెలవుల్లో, పండుగ రోజుల్లో కూడా పని చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. నెలలో ఒక్కరోజు కూడా కుటుంబ సభ్యులతో సమయం గడపలేక, అనారోగ్యాలకు గురవుతూ తీవ్రమైన మానసిక ఒత్తిడికి లోనవుతున్నట్లు చెప్పారు. పని భారం, ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగించేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అసోసియేషన్ కార్యదర్శి ప్రసాద్, ఉమామహేశ్వరరావు, లక్ష్మణరావు, చెన్నకేశవులు, శ్రీనివాస్, హర్షవర్ధినీ పాల్గొన్నారు.



ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న కార్యదర్శులు

వైభవంగా శ్రీరాజేశ్వరస్వామి కల్యాణోత్సవం

ఉంగుటూరు: పొణుకుమాడులో గంగా పార్వతీసమేత రాజేశ్వరస్వామి దేవస్థానంలో శివ పార్వతుల దివ్య కల్యాణోత్సవం బుధవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. బ్రహ్మశ్రీ స్వర్ణ నాంచారేశ్వరశర్మ స్వామివార్ల కల్యాణ క్రతువును కన్నుల పండువగా జరిపించారు. ఆలయ ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించగా, ఉత్సవ కమిటీ ఛైర్మన్ రమేష్ దంపతులు పీటలపై కూర్చొని కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. నందివాహనంపై గురువారం గ్రామోత్సవం నయనానందకరంగా నిర్వహించారు.

రైతన్నలకు సబ్సిడీపై యంత్రపరికరాలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : రైతులకు సబ్సిడీపై వివిధ యంత్ర పరికరాలను అందజేస్తున్నట్లు మండల వ్యవసాయశాఖ అధికారి భవాని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బాపులపాడు మండల వ్యాప్తంగా సుమారు రూ. 25 లక్షల విలువైన తైవాన్ పవర్ స్ప్రేయర్లు, రోటోవీటర్, బ్యాటరీ స్ప్రేయర్లు, బుష్‌కట్టర్లు, ట్రాక్టర్లతో నడిచే బూమ్ వంటి పరికరాలను, యంత్రాలను అందజేస్తున్నట్లు వివరించారు. సన్న, చిన్నకారు రైతులు రైతు సేవా కేంద్రాల్లో ఆధార్‌కార్డు, భూ వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని వ్యవసాయ యాంత్రీకరణతో అధిక దిగుబడుల సాధించాలని భవాని పేర్కొన్నారు.

వైభవంగా గుడ్ల గౌరవమ్మ సంబరాలు

గన్నవరం : మర్లపాలెంలో గుడ్ల గౌరవమ్మ సంబరాలు గురువారం వైభవంగా జరిగాయి. తొలుత అమ్మవారికి విశేష అలంకరణ జరిపి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పాలపొంగళ్లు నివేదనగా సమర్పించారు. గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి వేల మంది భక్తులు వచ్చి గౌరవమ్మ తల్లిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం అమ్మవారికి మహా నివేదన తరువాత హారతి కార్యక్రమం జరిపారు. అనంతరం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏడు వేల మందికి అన్నసమారాధన జరిపారు. కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పక్షుల దప్పిక తీర్చడం బాధ్యత

రాణా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు సుంకర సాంబశివ రాయల్

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : వేసవి ఉష్ణోగ్రత పెరుగుతుండడంతో మనుషులతో పాటు పశుపక్ష్యాదులు సైతం ఉక్కిరి బిక్కిరవుతున్నాయి. చెరువులు, కుంటలు ఎండిపోవడంతో దప్పిక తీర్చుకునేందుకు పక్షులు తల్లడిల్లుతున్నాయి. ఈ క్రమంలో సుంకర సాంబశివ రాయల్ తన వంతుగా చల్లని నీటిని అందించేలా ఏర్పాటు చేశారు. కానుమోలుకు చెందిన రాణా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు సుంకర సాంబశివరాయల్ తన ఇంటి ఆవరణలోని చెట్లకు చల్లని నీటితో నింపిన మట్టి కుండలను వేలాడ దీసి ఉదయం, సాయంత్రం నీటిని నింపి పక్షుల దాహార్తి తీరుస్తుతున్నారు. పక్షులు అలవాటు పడటంతో ఒక దాని వెంట మరొకటి వచ్చి దప్పిక తీర్చుకుని సేదతీరుతున్నాయి. మూగజీవుల ప్రాణాలను కాపాడటం బాధ్యతగా గుర్తించి తన వంతుగా ఏర్పాటు చేశానని, పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని ఆయన అన్నారు.

బీఆర్ నాయుడు సేవలు అద్వితీయం

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : తిరుమల, తిరుపతి దేవస్థాన పవిత్రతను కాపాడుతూ సామాన్య భక్తులు శ్రీనివాసుని దర్శించుకునేలా వినూత్న పథకాలకు కార్యాచరణ చేస్తున్న టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు సేవలు అద్వితీయమని తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికల్యాణి అన్నారు. వెలగపూడిలోని రాజధాని రైతుల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో గౌరవ అతిథిగా పాల్గొన్న బీఆర్ నాయుడును కలిసి మొక్క ఇచ్చి సత్కరించారు. తెలుగునాడు అంగన్‌వాడీ-డ్వాక్రా సాధికార సంస్థ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ బొప్పన నీరజ, తెలుగురైతు రాష్ట్ర సోషల్‌మీడియా కో ఆర్డినేటర్ పెందుర్తి శ్రీకాంత్, సుధీర్, పాల్గొన్నారు.

పేదలు ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోవాలి

ఉయ్యూరు, మార్చి 13 (ఆంధ్ర జ్యోతి) : ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయంతో పేదలు నిర్మాణం పూర్తి చేసుకోవాలని ఎంపీడీవో శేషగిరిరావు అన్నారు కాటూరు ఎన్టీఆర్ కాలనీలో గురువారం పర్యటించి ప్రభుత్వం పథకాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోవాలని సూచించారు.

కౌలు రైతులకు నూతన చట్టం రూపొందించాలి

ఉయ్యూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : కౌలురైతులకు నూతన చట్టాన్ని ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే రూపొందించాలని ఏపీ కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు డిమాండ్ చేశారు పం టలకు మద్దతు ధర చట్టం చేయాలని, కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయాలని, మినుము క్వింటాలుకు రూ. తొమ్మిది వేల చొప్పున చెల్లించి రైతుల నుంచి కొనుగోలు చేయాలని కోరుతూ గురు వారం ఆర్డీవోను కలిసి వినతి పత్రం అందచేశారు. సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు, అధ్యక్షుడు కోసూరి శివనాగేంద్రం, మరియదాసు పాల్గొన్నారు.

భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టాలని వినతి

బెంజిసర్కిల్, మార్చి13(ఆంధ్రజ్యోతి): విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామ పంచాయతీ పరిధిలో వేసిన రియల్ ఎస్టేట్ భూముల్లో పంచాయతీకి కేటాయించిన కామన్ సైట్‌లు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలి కోరుతూ నున్నకు చెందిన దండు సుబ్రహ్మణ్యంరాజు గురువారం ఎన్టీఆర్ జిల్లా ఆర్డీవో చైతన్యకు వినతి పత్రం అందజేశారు. ఇప్పటికే కొన్ని భూములు అన్యాక్రాంతమయ్యాయని, ఈకామన్ భూములను పరిరక్షించే బాధ్యత పంచాయతీ తీసుకోవాలని ఆయన కోరారు. దీనిపై ఆర్డీవో స్పందిస్తూ తక్షణం చర్యలు తీసుకుంటామని హామీఇచ్చినట్లు సుబ్రహ్మణ్యంరాజు తెలిపారు.

చిన్నారుల సమగ్రాభివృద్ధే లక్ష్యం

ఉంగుటూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు నాణ్యమైన ప్రీస్కూల్ విద్య, మేలైన పోషకాహారాన్ని అందించడం ధ్యేయంగా పోషణ్ బీ పడాయి బీ పథకాన్ని సమర్థంగా అమలు చేయాలని ఐసీడీఎస్ సీడీపీవో పి.వెంకటలక్ష్మి సూచించారు. ఆత్కూరు జడ్పీహైస్కూల్‌లో రెండో విడతగా అంగన్వాడీ కార్యకర్తలకు గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న పోషణ్ బీ, పడాయి బీ శిక్షణ కార్యక్రమం గురువారం ముగిసింది. సీడీపీవో మాట్లాడుతూ మూడు నుంచి ఆరేళ్లలోపు పిల్లలకు ప్రీప్రైమరీ స్థాయిలో నైపుణ్యంతో కూడిన విద్యను అందించేందుకు శిక్షణ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను సక్రమంగా పాటిస్తూ పిల్లలకు మంచి పోషకాహారంతోపాటు, నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. సూపర్‌వైజర్లు బి.పద్మాదేవి, ఎల్.దుర్గాదేవి, పాఠశాల హెచ్ఎం కేవీబీకే సుధాకర్, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.







ఆక్రమణల కారణంగా ద్విచక్ర వాహనాలు వెళ్లలేని స్థితిలో బీసెంట్ రోడ్డు

కబ్జా కోరల్లో.. బీసెంట్ రోడ్డు

రాజకీయ పార్టీల అనుచరుల పేరుతో ఆక్రమణలు

- వ్యాపారాలు చేయకుండా అద్దెలకు ఇస్తున్న వైనం
- ప్రజల ఇబ్బందులు పట్టించుకోని అధికారులు

(ఆంధ్రజ్యోతి-గవర్నర్‌పేట): దశాబ్దాల కాలంగా వస్త్ర వ్యాపారానికి కేంద్రంగా ఉన్న బీసెంట్ రోడ్డు నేడు హాకర్ల ముసుగు వేసుకున్న కబ్జాదారుల చెరలో ఉంది. బందరు రోడ్డు రాఘవయ్య పార్కు హద్దుగా మొదలై ఏలూరు రోడ్డును కలిసే వరకూ రోడ్డును హాకర్ల ముసుగులో ఉన్న కబ్జాదారులు సొంతం చేసుకున్నారు. తూర్పు, సెంట్రల్ నియోజకవర్గాలకు చెందిన వివిధ పార్టీ నేతల అనుచరులు బీసెంట్ రోడ్డులో ఆక్రమణలకు తెగబడటమే కాకుండా స్థలాలను మార్కింగ్ చేసి పేదలకు వ్యాపారాలు చేసుకోవడానికి అద్దెలకు ఇస్తున్నారు. కనీసం ద్విచక్రవాహనాలు వెళ్లడానికి కూడా వీలులేకుండా బీసెంట్ రోడ్డు కబ్జాలకు గురైంది. కబ్జాదారుల ఆగడాలకు భయపడి స్థానిక వ్యాపారులు వలస పోయే పరిస్థితి దాపురించింది. స్థానిక వ్యాపారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదు.

అధికారంతో పాటు ఆక్రమణదారులూ మారతారు

రాష్ట్రంలో అధికారం మారిన ప్రతిసారీ ఇక్కడ ఆక్రమణదారులు మారిపోతూ ఉంటారు. కొత్తగా వచ్చిన ప్రజాప్రతినిధులు పాత వారిని తొలగించి కొత్తవారికి స్థలాలు కేటాయిస్తున్నారు. ఖాళీ స్థలాల్లో పాగాలు వేయిస్తున్నారు. కార్యకర్తలకు చిరు వ్యాపారుల ముసుగులు వేయిస్తున్నారు. పోలీసు లు, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది అటువైపు చూడకుండా ఆర్డర్లు పాస్ చేస్తున్నారు. పోనీ ఆక్రమించిన పార్టీల కార్యకర్తలు వీధి వ్యాపారాలు చేస్తారా అంటే అదీ ఉండదు. హాకర్లను ఎంపిక చేసుకుని రోజువారీ అద్దెకు స్థలాన్ని లీజుకు ఇస్తున్నారు. వామపక్షాలు మొదలుకుని టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్ పార్టీల ద్వితీయ శ్రేణినేతలు బీసెంట్ రోడ్డు మీద జీవనం సాగిస్తున్నారంటే అతిశయోక్తి కాదు. వైసీపీ అధికారంలో ఉన్నన్నాళ్లు మాజీ ప్రజాప్రతినిధి అనుచరుల కనుసన్నల్లో బీసెంట్ రోడ్డు వీధి వ్యాపారాలు సాగాయి. కూటమి అధికారంలోకి రావడంతో ప్రస్తుత ప్రజాప్రతినిధి అనుచరగణానికి బీసెంట్ రోడ్డు మీద కన్నుపడింది. లెనిన్ సెంటర్, బీసెంట్ రోడ్డును ఆక్రమించి హాకర్లకు అద్దెలకు ఇచ్చుకుని సంపాదించుకోవాలని ప్రయత్నాలు మొదలెట్టారు. దీని ఫలితంగానే బుధవారం బీసెంట్ రోడ్డులో హాకర్ల మధ్య వివాదాలు తలెత్తాయి. అధికార పార్టీ కార్యకర్తలు బీసెంట్ రోడ్డులో వివిధ కూడలి ప్రాంతాల్లో తోపుడు బండ్లు ఏర్పాటు చేసుకునేందుకు ప్రయత్నించారు. వైసీపీ, వామపక్షాలకు చెందిన కార్యకర్తలు అడ్డుకున్నారు. పోలీసుల జోక్యంతో తాత్కాలికంగా గొడవ సర్దుమణిగినప్పటికీ మళ్లీజరిగే అవకాశముందని స్థానికవ్యాపారులు ఆందోళన చెందుతున్నారు.



ఇబ్రహీంపట్నం రింగ్‌లో పోలీస్ అవుట్ పోస్టుకు, రింగ్‌కు కట్టిన వైన్ షాపు ఫ్లెక్సీ, కొండపల్లి, మైలవరం వైపు వెళ్లే బస్టాప్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ఇదేం చోద్యం!

- ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్లో ఎక్కడ చూసినా వైన్‌షాపు ఫ్లెక్సీలే
- పోలీస్ అవుట్ పోస్టుకూ కట్టిన వైనం

(ఆంధ్రజ్యోతి-ఇబ్రహీంపట్నం): మాకేంటి అడ్డు అన్న చందంగా వైన్‌షాపు యజమానులు రెచ్చిపోతున్నారు. ఇబ్రహీంపట్నం రింగ్‌లో ఎక్కడ పడితే అక్కడ ఫ్లెక్సీలు కట్టేశారు. అంతటితో ఆగకుండా రింగ్‌లో ఉన్న పోలీస్ అవుట్ పోస్టుకూ ఫ్లెక్సీలు కట్టేశారు. రింగ్ సెంటర్, హైదరాబాద్ వైపు వెళ్లే బస్టాండ్, మైలవరం వైపు వెళ్లే బస్టాండ్ల వద్ద పెద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అధికారులు స్పందించి ఫ్లెక్సీలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

రాజధాని ప్రాంతంలో డిఫెన్స్ ఏరోస్పేస్ ఉత్పత్తుల పరిశ్రమలు

- త్వరలో రాబోతున్నాయన్న కేంద్ర ప్రభుత్వ డిఫెన్స్ సలహాదారు డాక్టర్ జి.సతీష్ రెడ్డి



డాక్టర్ జి.సతీష్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్

వన్‌టౌన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): రాజధాని ప్రాంతానికి త్వరలో డిఫెన్స్ ఏరోస్పేస్ ఉత్పత్తుల పరిశ్రమలు రాబోతున్నాయని డీఆర్‌డీవో మాజీ చైర్మన్, కేంద్ర ప్రభుత్వ డిఫెన్స్ సలహాదారు డాక్టర్ జి.సతీష్ రెడ్డి తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఎంఎస్ఎంఈ పరిశ్రమల యజమానుల సంఘ అసోసియేషన్ కౌన్సిల్ సభ్యులతో గురువారం గురునానక్ కాలనీలోని ఎంపీ కేశినేని శివనాథ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడారు. త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్‌ను కలిసి ఈ ప్రాంత పారిశ్రామిక అభివృద్ధికి అనుసరించాల్సిన వ్యూహంపై చర్చిస్తామని తెలిపారు. రాజధాని ప్రాంతంలో పరిశ్రమలు అభివృద్ధి చెందాల్సిన అవసరం, ప్రభుత్వం అందిస్తున్న సహకారం, ఎంపీ కేశినేని శివనాథ్ ఇందుకోసం చేస్తున్న కృషిని పారిశ్రామికవేత్తలకు ఆయన వివరించారు. ఎంపీతో కలిసి సతీష్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ అధికారులతో కలిసి ఎంపీ శివనాథ్ పారిశ్రామిక అభివృద్ధికి తగిన స్థలాన్ని ఎంపిక చేసేందుకు సర్వే చేస్తారని చెప్పారు. దేశంలోని ప్రతి రాజధా ని నగరంలో ఇండస్ట్రీలు, స్టార్టప్‌లు వస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వ డిఫెన్స్, ఏరోస్పేస్, కమ్యూనికేషన్, రైల్వే రంగాల్లో స్వదేశంలో ఉత్పత్తులను తయారు చేసి వాటినే వినియోగించాలన్న లక్ష్యంతో ప్రధాని నరేంద్ర మోదీ పనిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎంఎస్ఎంఈ ఇండస్ట్రీస్ అసోసియేషన్ గౌరవ ప్రెసిడెంట్ బాయన వెంకటరావు, ప్రెసిడెంట్ దోనేపూడి దుర్గాప్రసాద్, జనరల్ సెక్రటరీ ఎం.రామచంద్రరావు, జేఆర్డీ టాటా ఇండస్ట్రీస్ ఎస్టేట్ సొసైటీ చైర్మన్ వినోద్ బాబు, సెక్రటరీ టి.శ్రీనివాసరావు, విజయవాడ ఇండస్ట్రియల్ ఎస్టేట్ మాన్యుఫ్యాక్చరింగ్ అసోసియేషన్ సెక్రటరీ టి.నాగేశ్వరరావు, ఏపీ చాంబర్ ప్రెసిడెంట్ పి.భాస్కరరావు, ఏపీ చాంబర్ సెక్రటరీ ఎం.రాజశేఖర్, పారిశ్రామికవేత్తలు కోనేరు విశ్వప్రసాద్, కె.రాజేష్, వి.రమేష్‌బాబు, కె.శశికాంత్, జి.శ్రీనివాస్, టి.పార్థసారథి, ఎ.రమేష్‌బాబు, బి.వెంకటరావు, జేఎస్ఆర్కే ప్రసాద్ పాల్గొన్నారు.

జూన్ నాటికి ఉమెన్స్ హాస్టల్, ఫార్మశీ కళాశాల

భవనాల నిర్మాణం పూర్తి చేస్తాం

- కృష్ణా యూనివర్సిటీ వీసీ కె.రాంజీ



మాట్లాడుతున్న వీసీ కె.రాంజీ

మచిలీపట్నం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): కృష్ణా యూనివర్సిటీ ప్రాంగణంలో ఫార్మశీ కళాశాల, ఉమెన్స్ హాస్టల్ భవనాల నిర్మాణాన్ని జూన్ నెలాఖరు నాటికి పూర్తిచేస్తామని కృష్ణా యూనివర్సిటీ వీసీ కె.రాంజీ తెలిపారు. యూనివర్సిటీలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యూనివర్సిటీలో బాలుర, బాలికల వసతిగృహాలు అందుబాటులో లేకపోవడంతో వివిధ కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులు ముందుకు రావడం లేదన్నారు. ఈ భవనాల నిర్మాణం పూర్తి చేసే అంశంపై కాంట్రాక్టర్లు, ఏపీఈడబ్ల్యూఐడీసీ అధికారులతో సంప్రదింపులు జరిపినట్లు తెలిపారు. భవనాల నిర్మాణాలను పర్యవేక్షించేందుకు కృష్ణా యూనివర్సిటీతో ఒప్పందం చేసుకున్న ఏపీఈడబ్ల్యూఐడీసీ అధికారులు సక్రమంగా చేయకపోవడం, గతంలో కొన్ని కారణాలతో భవనాల నిర్మాణాన్ని యూనివర్సిటీ అధికారులు పట్టించుకోకపోవడంతో జాప్యం జరిగిందని తెలిపారు. భవనాల నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేయకపోతే 12శాతం నగదును అపరాధ రుసుముగా వసూలు చేస్తామని ఒప్పందం చేసుకుని ఫార్మశీ, ఉమెన్స్ హాస్టల్ భవనాల నిర్మాణ పనులను ప్రస్తుతం ప్రారంభించామని వీసీ తెలిపారు. ఇటీవల బడ్జెట్‌లో కృష్ణా యూనివర్సిటీకి రూ.10.50 కోట్లు కేటాయించారని, ఈ నిధులు జీతభత్యాలకు సరిపోతాయన్నారు. యూనివర్సిటీలో ఇంజనీరింగ్ కళాశాల, బాలుర హాస్టల్ భవనాల నిర్మాణాలను ప్రస్తుతానికి నిలిపివేశామని తెలిపారు. ఈ రెండు భవనాల నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేయాలని ప్రతిపాదనలు పంపుతామన్నారు. ప్రభుత్వం నిర్ణయం మేరకు ఈ భవనాల నిర్మాణం ఎప్పుడు ప్రారంభించాలో తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. ఇప్పటివరకు యూనివర్సిటీలో నిర్మాణం చేసిన భవనాలకు నిబంధనల మేరకే బిల్లులు మంజూరు చేశారని తన పరిశీలనలో వెల్లడైందని ఆయన చెప్పారు.

త్వరలో యూనివర్సిటీ 8వ స్నాతకోత్సవం

త్వరలో కృష్ణా యూనివర్సిటీ 8వ స్నాతకోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వీసీ కె.రాంజీ తెలిపారు. ఇందుకోసం గవర్నర్ అనుమతిని కోరుతామన్నారు. వచ్చే విద్యాసంవత్సం నుంచి యూనివర్సిటీలో ఎం-ఫార్మశీ కోర్సును పునరుద్ధరిస్తామన్నారు. గతంలో ఎం ఫార్మశీ కోర్సు కొనసాగిందని, కొన్ని కారణాలతో ఈ కోర్సును నిలిపివేశారని తెలిపారు. మంచి డిమాండ్ ఉన్న ఈ కోర్సును యూనివర్సిటీలో మళ్లీ ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. యూనివర్సిటీలో వివిధ అభివృద్ధి పనులు చేసేందుకు ఎంపీ వల్లభనేని బాలశౌరిని కలసి ఎంపీలాడ్స్ నుంచి నిదులను విడుదల చేయాలని కోరామన్నారు. ఎంపీ నిధులతోపాటు నరేగా నిధులతో యూనివర్సిటీలో అంతర్గత రహదారుల పనులు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. రెక్టార్ ఎంవీ బసవేశ్వరరావు, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఉష పాల్గొన్నారు.

ఆర్టీసీ జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీకి

ఎయిర్ బ్రేక్ బీఎస్-6 మోడల్ పరికరం

- రూ.15 లక్షల విలువైన పరికరాన్ని ఉచితంగా అందజేసిన చెన్నైకు చెందిన జడ్‌ఎఫ్‌సీబీసీఎస్ ఇండియా లిమిటెడ్



పరికరాన్ని ప్రారంభిస్తున్న ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు

బస్‌స్టేషన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): విద్యాధరపురం ఆర్టీసీ జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీకి సంస్థ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు చొరవతో రూ.15లక్షల విలువైన ఎయిర్‌బ్రేక్ బీఎస్-6 మోడల్ పరికరాన్ని చెన్నైకు చెందిన జడ్‌ఎఫ్‌సీబీసీఎస్ ఇండియా లిమిటెడ్ ఉచితంగా అందజేసింది. ఈ పరికరాన్ని గురువారం ద్వారకా తిరుమలరావు ప్రారంభించారు. డ్రైవర్లు, మెకానిక్‌లకు బస్సుల్లో బ్రేక్ సిస్టమ్‌పై మెరుగైన అవగాహన కల్పించడానికి, డ్రైవర్ల పనితీరు మెరుగు పరుచుకునేందుకు ఈ పరికరం ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. బస్సు బ్రేక్‌డౌన్లు, ప్రమాదాలు తగ్గుతాయని అన్నారు. జడ్‌ఎఫ్‌సీఈబీసీఎస్ ఇం డియా లిమిటెడ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎస్వీ సాంబశివరావు, ఏరియా మేనేజర్ ఎం.సుమన్, ఆర్టీసీ ఈడీలు సీహెచ్ రవివర్మ(పరిపాలన), టి.చెంగల్‌రెడ్డి(ఇంజనీరింగ్), జోన్-2 ఈడీ జి.విజయరత్నం, జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ పి.నీలిమ తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు పక్కా ఏర్పాట్లు

- ఎన్టీఆర్ జిల్లాలో 168 పరీక్షా కేంద్రాలు
- ఏ, బీ, సీలుగా కేంద్రాల విభజన
- రాసే విద్యార్థులు 31,231 మంది
- పర్యవేక్షణకు ఐదు ఫ్లయింగ్, తొమ్మిది సిట్టింగ్ స్క్వాడ్‌లు: డీఈవో సుబ్బారావు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

ఎన్టీఆర్ జిల్లాలో ఈనెల 17 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు పక్కాగా అన్ని ఏర్పాట్లు చేశామని జిల్లా విద్యాశాఖాధికారి సుబ్బారావు తెలిపారు. పరీక్షల నిర్వహణపై ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

ప్రశ్న: ఈ విద్యాసంవత్సరంలో ఎంతమంది పరీక్షలు రాస్తున్నారు

జవాబు: జిల్లాలో మొత్తం 31,231 మంది పరీక్షలకు హాజరుకాబోతున్నారు. వారిలో రెగ్యులర్ విద్యార్థులు అబ్బాయిలు 11,696, అమ్మాయిలు 15,987 మంది ఉన్నారు. ఓపెన్ స్కూల్‌కు సంబంధించి అబ్బాయిలు 1320, అమ్మాయిలు 423 మంది రాస్తారు. సప్లిమెంటరీ పరీక్షలు అబ్బాయిలు 1196, అమ్మాయిలు 609 మంది రాస్తారు.

ప్రశ్న: ఎంతమంది సిబ్బందిని ఉపయోగిస్తున్నారు

జవాబు: 2,136 మంది ఉపాధ్యాయులను పరీక్షల నిర్వహణకు ఉపయోగిస్తున్నాం. డిపార్టుమెంటల్ అధికారులుగా 168, చీఫ్ సూపరింటెండెంట్లుగా 168, కస్టోడియన్లుగా 50 మంది, ఇన్విజిలేటర్లుగా 1750 మందిని నియమించాం. సబ్జెక్టు టీచర్లకు ఆయా సబ్జెక్టులకు సంబంధించిన పరీక్షలు జరిగే రోజున విధులను మార్చుతాం.

ప్రశ్న: జిల్లాలో ఎక్కడైనా సమస్యాత్మక కేంద్రాలు ఉన్నాయా

జవాబు: జిల్లాలో మూడు డివిజన్లలో ఆరు పరీక్షా కేంద్రాలు సమస్యాత్మకంగా గుర్తించాం. తిరువూరులో శ్రీచైతన్య, నారాయణ, నందిగామలో నారాయణ, శ్రీచైతన్య, జగ్గయ్యపేటలో చేగు విద్యాలయం, మైలవరంలో ఎస్ఎస్‌కే ఉన్నత పాఠశాలలను సమస్యాత్మకంగా గుర్తించాం. ఈ కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం.

ప్రశ్న: పరీక్షా కేంద్రాలు ఎన్ని కేటగిరీలుగా విభజించారు

జవాబు: జిల్లాలో ఉన్న పరీక్షా కేంద్రాలను ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజించాం. పోస్టాఫీసు, పోలీస్ స్టేషన్ అందుబాటులో ఉన్న కేంద్రాలను ఏ కేటగిరీగా గుర్తించాం. పోలీస్ స్టేషన్ లేక పోస్టాఫీసు అందుబాటులో ఉండే కేంద్రాలను బీ కేటగిరీలో చేర్చాం. పోలీస్‌స్టేషన్, పోస్టాఫీసు లేని కేంద్రాలను సీ కేటగిరీలో పెట్టాం.

ప్రశ్న: మొత్తం ఎన్ని పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు

జవాబు: జిల్లాలో మొత్తం 168 పాఠశాలలను పదో తరగతి పరీక్షలకు కేంద్రాలుగా ఎంపిక చేశాం. వాటిలో ఏ కేటగిరీ కేంద్రాలు 134, బీ కేటగిరి కేంద్రాలు 22, సీ కేటగిరీ కేంద్రాలు 12 ఉన్నాయి.

ప్రశ్న: తనిఖీలకు ఎన్ని స్క్వాడ్లు నియమించారు

జవాబు: జిల్లాలో నిర్వహించే పరీక్షా కేంద్రాలను తనిఖీ చేయడానికి ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్లను నియమించాం. ప్రతి స్క్వాడ్‌లో డిప్యూటీ తహసీల్దార్, ఎస్ఐ, విద్యాశాఖ నుంచి ఒకరు ఉంటారు. ఇవి కాకుండా తొమ్మి ది సిట్టింగ్ స్క్వాడ్లు సీ కేటగిరీ కేంద్రాల్లో నియమించాం.

ప్రశ్న: ఒక్కో కేంద్రంలో ఎంతమంది పరీక్ష రాస్తారు

జవాబు: జిల్లాలో ప్రతి పరీక్షా కేంద్రంలో 100 మంది విద్యార్థులు పరీక్షలు రాసేలా ఏర్పాట్లు చేశాం. పాఠశాలలు పెద్దగా ఉన్న కేంద్రాల్లో 200 మంది వరకు రాస్తారు.



ఆకాశవాణీయం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు తదితరులు

రాజ్యాంగం పట్ల అందరికీ అవగాహన అవసరం

- ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు

బస్ స్టేషన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యానికి మార్గదర్శిగా నిలుస్తున్న రాజ్యాంగం పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఏపీఎస్ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు అన్నారు. ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం ఆధ్వర్యంలో 75 ఏళ్ల రాజ్యాంగం, వేవ్స్ సదస్సు, మహిళా భద్రతపై గురువారం బస్‌స్టేషన్‌లోని సమావేశపు మందిరంలో నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథి ద్వారకా తిరుమలరావు మాట్లాడారు. రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తి చేసుకోవటం అందరికీ గర్వకారణమన్నారు. మహిళలు, చిన్నారులపై నేరాల్లో సత్వర న్యాయం కల్పించేలా నూతన న్యాయ చట్టాల్లో తగిన ప్రాధాన్యం కల్పించాలని విజయవాడ డిప్యూటీ పోలీస్ కమిషనర్ కేజీవీ సరిత అన్నారు. ఇటువంటి వార్తలను విలేకరులు ఎలా రాయాలనే అంశాలపై పలు సూచనలు చేశారు. మరో ముఖ్య అతిథి విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి కె.శివ హర్ష మాట్లాడుతూ రాజ్యాంగాన్ని దేశ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా వర్ణచిత్రాలతో కాలిగ్రఫీతో రూపొందించారన్నారు. సిబ్బందికి రాజ్యాంగంపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని ఆకాశవాణి విజయవాడ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎం.సోమేశ్వరరావు తెలిపారు. సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్.రమేష్ చంద్ర, వరల్డ్ ఆడియో విజువల్ ఎంటర్‌టైన్‌మెంట్ వేవ్స్-2025 సదస్సు పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఆకాశవాణి ప్రాంతీయ వార్తావిభాగం రూపొందించిన ఆకాశవాణీయం ప్రత్యేక పుస్తకాన్ని ముఖ్య అతిథులు, ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగాధిపతి శ్రీసాయి వెంపటి ఆవిష్కరించారు. ఆకాశవాణి కార్యక్రమ విభాగాధిపతి బి.వెంకటేశ్వర్లు, హిందీ అధికార భాష రిటైర్డ్ అధికారి ఎం.సుబ్బాశేఖర్, ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగంలో పనిచేస్తున్న 26 జిల్లాల పాత్రికేయులు పాల్గొన్నారు.

విజయవాడలో పిక్కిల్ బాల్ కోర్టులు

లబ్బీపేట, మార్చి 13(ఆంధ్రజ్యోతి): నగరంలోని క్రీడాభిమానుల కోసం ది పిక్కిల్‌బాల్ రిపబ్లిక్ పేరుతో పిక్కిల్‌బాల్ కోర్టులు ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకురాలు డాక్టర్ స్రవంతి వడ్లమూడి తెలిపారు. సిద్ధార్థ నగర్, 7వలైన్, పాలీక్లినిక్ రోడ్డులో 4 అత్యాధునిక 8 లేయర్ అక్రిలిక్ కోర్టులు, ప్రీమియం పాడిల్స్, విశాలమైన సదుపాయాలతో ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఇటీవల ఈ క్రీడకు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పెరుగుతుందని, తమ ప్రాంగణం ద్వారా ప్రొఫెషనల్ ఆటగాళ్లకు ఉన్నతమైన అనుభూతిని అందించాలనే ఆశయంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఈ కోర్టులు సోమవారం నుంచి గురువారం వరకు ఉదయం 5గంటల నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 11 గంటల వరకు, శుక్రవారం నుంచి ఆదివారం వరకు ఉదయం 5 గంటల నుంచి 12 గంటల వరకు సాయంత్రం 4 గంటల నుంచి 11 గంటల వరకు అందుబాటులో ఉంటాయన్నారు. వివరాలకు 99662 71172లో సంప్రదించాలన్నారు.

డీఎస్సీ కోచింగ్ కోసం రేపటిలోగా

పేర్లు నమోదు చేసుకోండి

మచిలీపట్నం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ద్వారా ఉచిత డీఎస్సీ కోచింగ్ కోసం ఇప్పటికే ఎంపికైన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు తమ పేర్లను జ్ఞానభూమి పోర్టల్‌లో ఈనెల 15వ తేదీలోగా నమోదు చేసుకోవాలని సాంఘిక సంక్షేమశాఖ జేడీ షాహిద్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏ కోచింగ్ సెంటరులో శిక్షణ పొందేందుకు సుముఖంగా ఉన్నారో తెలియజేస్తూ వెబ్‌సైట్‌లో ఆప్షన్లు పెట్టుకోవాలని ఆయన సూచించారు.

కృష్ణా జిల్లాలో 145 కేంద్రాల్లో 'పది' పరీక్షలు

- రాయనున్న 22,341 మంది: డీఈవో పీవీజే రామారావు

మచిలీపట్నం టౌన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఈనెల 17 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తామని కృష్ణా జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే రామారావు తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని డీఈవో కార్యాలయంలోని తన చాంబర్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా 145 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు 8.30 గంటలకే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు. మొత్తం 22,341 మంది పరీక్షలకు హాజరవుతారని, వారిలో 11,770 మంది బాలురు, 10,571 మంది బాలికలు ఉన్నారన్నారు. చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్, రూట్ అధికారులు, కస్టోడియన్, స్క్వాడ్ ఆఫీసర్లు, ఇన్విజిలేటర్లను నియమించి సూచనలు, సలహాలు ఇచ్చామన్నారు. విద్యార్థులు, ఇన్విజిలేటర్లు, ఇతర సిబ్బంది ఎవరూ పరీక్షా హాల్లోకి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకెళ్లడానికి వీల్లేదన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈనెల 17న తెలుగు, 19న హిందీ, 21న ఇంగ్లీషు, 22న ఓరియంటల్, 24న గణితం, 26న భౌతిక శాస్త్రం, 27న జీవశాస్త్రం, 29న ఒకేషనల్ కోర్సు(లాంగ్వేజ్), 31 లేదా ఏప్రిల్ 1న సాంఘిక శాస్త్రం పరీక్షలు జరుగుతాయన్నారు. వీటికి సమాంతరంగా 23 పరీక్షా కేంద్రాల్లో ఓపెన్ స్కూల్ పరీక్షలు జరుగుతాయని, 1,087 మంది విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం

దుకాణాల లైసెన్స్ హక్కుకు వేలం

మోపిదేవి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో పలు దుకాణాల లైసెన్స్‌లకు సీల్డ్ టెండర్లు, బహిరంగ వేలం నిర్వహించారు. భక్తులు విచ్చేసిన వాహనాల పార్కిం గ్ యాత్రికుల సామగ్రి, సెల్‌ఫోన్లు భద్రపర్చుకొను హక్కు కు తగిన పాట రాకపోవటంతో వాయిదా వేసినట్లు ఆలయ ఈవో డి.శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో చెవిపోగులు విక్రయించుట, చెవులు కుట్టు లైసెన్స్ మోపిదేవికి చెందిన ఎల్.బ్రహ్మానందం, సీసీ కెమెరాల పర్యవేక్షణకు సీల్డ్ టెండరు ద్వారా కె.కేదార్‌నాథ్ హక్కు పొందారు. ఆవుపాలు సరఫరా చేయడానికి టెండరు నిర్ధారించాల్సి ఉందన్నారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించే నిత్యాన్నదానానికి పెరుగు సరఫరా చేయడానికి మోపిదేవికి చెందిన విస్సంశెట్టి గుప్తా, అన్నదానానికి అరటి ఆకులు సరఫరా చేసేందుకు కె.రాఘవేంద్రరావు దక్కించుకున్నారు.

యువకుడిపై కత్తితో దాడి

గుడివాడ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): పాత కక్షల నేపథ్యంలో యువకుడిపై మాంసం కొట్టే కత్తితో మరో వ్యక్తి దాడిచేయగా, యువకుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. పుప్పాల పవన్, సిరిగుడి శ్రీను మధ్య పాతగొడవలున్నాయి. గురువారం రాత్రి ఇద్దరి మధ్య గొడవ మొదలైంది. స్థానిక మాంసం మార్కెట్ సెంటర్‌లో శ్రీనుపై పుప్పాల పవన్ మాంసం కొట్టే కత్తితో దాడిచేశాడు. దీంతో శ్రీను తీవ్రంగా గాయపడ్డాడు. స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్య చికిత్సనిమిత్తం శ్రీను కుటుంబసభ్యులు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ కె.శ్రీనివాస్ తెలిపారు.

16న తుమ్మపల్లిలో

'తెలుగు వారధి'

గుణదల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): తెలుగు వారికి వారధి కార్యక్రమం ద్వారా ఎంతో మేలు జరగనుందని ఫెడరేషన్ ఆఫ్ తెలుగు అసోసియేషన్స్ ఆఫ్ మహారాష్ట్ర అధ్యక్షుడు గంజి జంగబాబు తెలిపారు. నగరంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఈనెల 16న నగరంలోని తుమ్మలపల్లిలో వారధి కార్యక్రమాన్ని నిర్వహించి దాని వల్ల తెలుగు వారికి కలిగే ఉపయోగాలు తెలియజేయనున్నట్లు చెప్పారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని ప్రజలు ఎక్కువశాతం మహారాష్ట్రలోని ముంబాయి, పూణే, సోలాపూర్, షిర్డీ, నాగపూర్ తదితర నగరాల్లో జీవనం సాగిస్తున్నారని అటువంటివారిని సంఘటిత పరచడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ఈనెల 16న తుమ్మలపల్లి లో జరిగే కార్యక్రమానికి పలువురు మంత్రులు హాజరుకానున్నారని తెలిపారు.

హరేకృష్ణ



భక్తి చైతన్యమూర్తి

మానవులు మంచి దారిలో పయనించాలి. ధర్మబద్ధంగా జీవించాలి. అందుకు మార్గదర్శకులుగా నిలిచిన మహానుభావుల్లో ప్రముఖుడు శ్రీ చైతన్య మహాప్రభువు. సుమారు 500 ఏళ్ళ క్రితం పశ్చిమ బెంగాల్‌లోని నవద్వీపంలో జన్మించిన ఆయన భగవన్నామ సంకీర్తనమనే మార్గాన్ని ముక్తి మార్గంగా బోధించారు. కలియుగంలో సాక్షాత్తూ శ్రీకృష్ణుడి అవతారంగా ఆయనను భావిస్తారు. ప్రామాణికమైన శాస్త్రాధారాలు లేనిదే ఎవరినీ భగవంతుడి అవతారంగా అంగీకరించకూడదు. ప్రస్తుత కలియుగంలో భగవంతుడు అవతరించడం అనేది చాలా విశిష్టమైన విషయమే. అయితే ఈ అవతార స్వరూపం గురించిన పరిజ్ఞానం లోకంలో చాలా అరుదు. అటువంటి అవతారమూర్తి అయిన శ్రీ చైతన్య మహా ప్రభువు గురించి అందరూ తెలుసుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది. ఆయనను 'గౌర హరి', 'గౌరంగ', 'గౌర సుందర' అని కూడా సంబోధిస్తారు.


శ్రీ చైతన్యుల అవతార ప్రస్తావన 'శ్రీమద్భాగవతం', 'మహా భారతం', 'వాయుపురాణం', 'నృసింహ పురాణం', 'చైతన్యోపనిషత్తు' (అథర్వవేదం) తదితర గ్రంథాలలో ఉంది. "కలియుగంలో ఆవిర్భవించి, సదా కృష్ణ నామ గానాన్ని చేసే భగవదవతార మూర్తిని మేధో సంపత్తి ఉన్న మనుజులు సామూహిక సంకీర్తనలతో ఆరాధిస్తారు. ఆయనది నలుపు రంగు కాకపోయినా సాక్షాత్తూ శ్రీకృష్ణుడే. ఆయన సంకీర్తనోద్యమాన్ని స్థాపించడానికి తన అనుచరులతో కలిసి భువిపై అవతరిస్తారు" అని 'శ్రీమద్భాగవతం'లో ఉంది. అలాగే 'శ్రీ విష్ణు సహస్రనామం'లోని 'సువర్ణ వర్ణో హేమాంగో...' అనే శ్లోకం "మేలిమి బంగారు వర్ణఛాయతో అవతరించి, ముందుగా గృహస్థుడిగా పలు లీలలు చేస్తారు. అత్యంత సుందరమైన శరీర అవయవాలపై చందన లేపనంతో... సువర్ణ శోభతో ప్రకాశిస్తారు. ఆ తరువాత సన్న్యాసాశ్రమాన్ని స్వీకరించి, నిష్టాపరుడై, శాంత స్వభావంతో మెలగుతారు. భక్తి, సామరస్యాలకు తానే ఒక దివ్య సన్నిధానం అవుతారు" అని చెబుతోంది. దీనికి శ్రీల ప్రభుపాదులు వివరణనిస్తూ... "శ్రీల బలదేవ విద్యాభూషణులు 'నామార్థ సుధ' అనే పేరుతో 'శ్రీవిష్ణు సహస్రనామా'నికి భాష్యం రాశారు. పై శ్లోకం ఆధారంగా, ఉపనిషత్తులే సాక్ష్యంగా, ఆధారంగా శ్రీ చైతన్య మహాప్రభువు దేవాదిదేవుని అవతారమని నిర్ధారించారు" అంటూ సవివరంగా తెలిపారు.

అలా సాక్షాత్తూ శ్రీకృష్ణుడి అవతారమైన శ్రీ చైతన్య మహాప్రభువు... ఫాల్గుణ పౌర్ణమి రోజున జన్మించారు. కలియుగంలో భక్తులు ముక్తి పొందడం కోసం... హరినామ సంకీర్తనను బోధిస్తూ... 'హరే కృష్ణ' మహా మంత్రాన్ని మనకు అందించారు. ఆయన పుట్టిన రోజైన ఫాల్గుణ పౌర్ణమి నాడు చంద్రోదయం వరకూ ఉపవాసం, తరువాత ధాన్యాలు లేని ఆహారం తీసుకోవడం, వీలైనన్ని సార్లు 'హరేకృష్ణ' మంత్రాన్ని, శ్రీకృష్ణుడి పవిత్ర నామాలను జపించడం, సమీపంలోని హరేకృష్ణ ఆలయ సందర్శన, హరినామ సంకీర్తనల్లో పాల్గొనడం, శ్రీమద్భాగవత పురాణ పఠనాన్ని ప్రారంభించడం, గోపోషణకు దానం చేయడం, అన్నదానం లాంటివి చేయడం వల్ల శ్రీ చైతన్య మహాప్రభువు అనుగ్రహం లభిస్తుంది.

శ్రీసత్యగౌర చంద్రదాస ప్రభూజీ
అధ్యక్షుడు, హరే కృష్ణ మూవ్‌మెంట్,
హైదరాబాద్, 9396956984

సద్బోధ

కోరికలు, ఆందోళనలే ఆటంకాలు



ఒకప్పుడు బర్మాలో కొందరు వ్యక్తులు ఒక పెద్ద బౌద్ధాలయాన్ని నిర్మించాలని నిర్ణయించారు. ఆలయం చాలా అందంగా, వైభవంగా ఉండాలనీ, మరీ ముఖ్యంగా ఆలయ ముఖద్వారం మనోహరంగా కనిపించాలని అనుకున్నారు. దానికోసం ఒక నమూనాను తయారు చేయాలనీ ఒక బౌద్ధ సన్న్యాసిని కోరారు. అతను ఎన్నో ఆలయాల నమూనాలు రూపొందించి పేరు ప్రఖ్యాతులు పొందాడు. పైగా ఆ రంగంలో చాలా నైపుణ్యం ఉన్న శిష్యుడు అతనికి ఉన్నాడు. ఆ ఆలయం కోసం పని చెయ్యడానికి ఆ సన్న్యాసి ఒప్పుకున్నాడు.

గురుశిష్యులు ఆ పనిలో నిమగ్నమయ్యారు. గురువు ఒక నమూనా గీసి, శిష్యుడికి చూపించాడు. దాన్ని శిష్యుడు శ్రద్ధగా, నిశితంగా పరిశీలించి... ఆశించినంత గొప్పగా లేదన్నాడు. గురువు మరొకటి తయారు చేశాడు. శిష్యుడికి అదీ నచ్చలేదు. ఇలా సన్న్యాసి ఎన్ని తయారు చేసినా... అవి బాగోలేవని శిష్యుడు చెప్పడంతో... వాటిని అతను పక్కన పడేశాడు. ఇలా మూడు నెలలు గడిచాయి. ఒక రోజు మరొక నమూనాను గురువు తయారు చేస్తున్నాడు. ఈలోగా అతని కలంలోని సిరా చివరికి వచ్చేసింది. కాగితం మీద గీతలు సరిగ్గా పడడం లేదు. "బజారుకు వెళ్ళి సిరా తీసుకురా!" అని శిష్యుణ్ణి పంపాడు. తరువాత అతను కలంలో ఉన్న సిరాతోనే అక్కడక్కడా కొన్ని మార్పులు చేసి ఒక నమూనా రూపొందించాడు.

కొద్దిసేపటికి తిరిగి వచ్చిన శిష్యుడు దాన్ని చూసి ఆనందాశ్చర్యాలతో "గురువుగారూ! ఇది చాలా అద్భుతంగా ఉంది. ఆలయ నిర్మాతలు కూడా దీన్ని తప్పకుండా అంగీకరిస్తారు. ఇది ఎలా సాధ్యమయింది?" అని అడిగాడు.

అప్పుడు గురువు ఒక్క క్షణం ఆలోచించి "నువ్వు ఇక్కడే, నా సమక్షంలో ఉన్నంత సేపూ నువ్వు మెచ్చుకొనే విధంగా నమూనాను తయారు చేయాలనే కోరిక నాలో ఉండేది. 'అది జరగదేమో?' అనే ఆందోళన కూడా నా మనసులో ఉండేది. ఆ కోరిక, ఆందోళనలే సరైన నమూనా రూపొందించడంలో ఆటంకాలయ్యాయి. దాంతో అన్నీ వ్యర్థమయ్యాయి. నువ్వు బయటకు వెళ్ళాక... నీ గురించి పూర్తిగా మరచిపోయాను. నా సహజమైన తీరులో... ఎలా తోస్తే అలా గీశాను. కోరిక, ఆందోళన లేని మనసు చక్కటి దారిలో నా చేతిని నడిపించింది. అందుకే ఈ నమూనాలో ఆ అందం కనిపిస్తోంది" అని చెప్పాడు.

నాట్యం, గానం, చిత్రలేఖనం, గ్రంథపఠనం, ప్రసంగం... ఇలా ఏది చేస్తున్నా అందరి మెప్పు పొందాలనే కోరిక, ఎవరు ఎలా స్పందిస్తారోననే ఆందోళన, భయం ఉన్నప్పుడు... ఆ పనులను సవ్యంగా నిర్వహించలేం. "ఇదంతా 'నేను చేస్తున్నాను' అనే అహంకారం ఉంటే ఆ పనులు ఇంకా భ్రష్టుపడతాయి. ఇవేవీ లేకపోతే మనం చేసే పనులు అద్భుతంగా ఉంటాయి. సత్ఫలితాలను ఇస్తాయి. 'నేను' అనే భావన నీలో లేనప్పుడు... దైవం నీలో ప్రవేశించి, నిన్ను నడిపిస్తాడు" అంటారు స్వామి వివేకానంద. అలా చేసే కార్యం విజయవంతం కాకతప్పదు.

• రాచమడుగు శ్రీనివాసులు

నేడు హోలీ



సహజయోగ

హోలీ అంటేనే ఆనందం, ఆహ్లాదం కలగలిసిన ఉత్సవం. సామాజికమైన అంతరాలకు అతీతంగా అందరూ కలిసి చేసుకొనే సామూహిక వేడుక. భారతీయ సంప్రదాయంలో అనాదిగా భాగమైన ఈ రంగుల సంబరానికి ఆధ్యాత్మికంగా ఎంతో ప్రాధాన్యం ఉంది.

అఖండమైన ఆనందం కోసం

"హోలీ పండుగ అంటే హోలికా దహనం జరిగిన రోజు. దుష్టశక్తులు దహనమైన రోజు. నిజమైన యోగులు భగవంతుణ్ణి పరిపూర్ణంగా నమ్మిన భక్తులు జీవితంలో ఎటువంటి ప్రమాదం నుంచి అయినా బయపడగలరు. సంపూర్ణ రక్షణ పొందగలరు. ఎటువంటి దుష్టశక్తీ వారిని ఏమీ చేయలేదు. దీనికి ప్రహ్లాదుడి కథే తార్కాణం" అని పేర్కొంటూ... వివిధ సందర్భాల్లో హోలీ పండుగ ప్రాశస్త్యం గురించి శ్రీమాతాజీ నిర్మలాదేవి వెల్లడించారు.

ఈ వేడుక ఎలా ప్రారంభమయిందో తెలిపే ఒక కథ ఉంది దాని ప్రకారం... ప్రహ్లాదుణ్ణి అతని తండ్రి హిరణ్యకశిపుడు అనేక విధాలుగా హింసించేవాడు. అతణ్ణి చంపాలని హోలిక అనే రాక్షసిని హిరణ్యకశిపుడు ఆదేశించాడు. హోలికకు ఉన్న వరం వల్ల అగ్ని ఆమెను ఏమీ చేయలేదు. కాబట్టి బాలుడైన ప్రహ్లాదుణ్ణి పట్టుకొని, మండుతున్న చితిపై కూర్చోవాలని హోలికకు హిరణ్యకశిపుడు చెప్పాడు. అయితే ఆశ్చర్యకరంగా హోలిక అగ్నికి ఆహుతైపోయింది. ప్రహ్లాదుడు కనీసం చిన్న గాయమైనా కాకుండా సురక్షితంగా బయటకు వచ్చాడు. క్రూరత్వం ఎన్నడూ క్షమార్హం కాదని నిరూపించే పౌరాణిక ఘట్టం ఇది. కాగా. ప్రహ్లాదుడితో కలిసి చితి మీద హోలిక కూర్చున్నప్పుడు... అగ్నిదేవుడికి ఒక సందిగ్ధం ఎదురయింది. 'ఆమెకు మరణం ఏ రూపంలోనైనా రావచ్చు కాని అగ్ని ద్వారా కాదనే వరం ఉంది. ఆమెను దగ్ధం చెయ్యనని నేను వాగ్దానం చేశాను. కానీ ఇటువైపు చూస్తే ప్రహ్లాదుడున్నాడు. అతను అమాయకత్వంతో నిండినవాడు. దైవాంశతో జన్మించినవాడు. అతడు నా శక్తులకు అతీతుడు. అతణ్ణి ఎలా దహించగలను? ఇప్పుడేంచెయ్యాలి? అని అగ్నిదేవుడు కలవరపడ్డాడు. ఇది కర్తవ్యానికి, ధర్మానికి మధ్య ఏర్పడిన సందిగ్ధత. ఇలాంటి పరిస్థితుల్లో కర్తవ్యం కన్నా ధర్మం గొప్పది. ఒక ఉన్నతమైన లక్ష్యాన్ని నెరవేర్చాల్సి వచ్చినప్పుడు... చిన్న లక్ష్యాన్ని వదులుకోవడానికి సిద్ధపడాలి. అగ్నిదేవుడు కూడా అదే చేశాడు. హోలికను దగ్ధం చేసి, ప్రహ్లాదుణ్ణి క్షేమంగా విడిచిపెట్టాడు.



మీరు మీ ఆత్మ వైపు మరలండి...

హోలీ పండుగ శ్రీకృష్ణుడి కాలంలో ఆరంభమయిందని కూడా అంటారు. "శ్రీకృష్ణుడు అవతరించే సమయానికి ధర్మాచరణ ఎంతో కఠినంగా ఉండేది. చాలా ఆచారాలు పాటించాల్సి వచ్చేది. దీనివల్ల ఇబ్బందిగా కూడా ఉండేది. ఒక చోట కాకుండా మరో చోట దీపం వెలిగిస్తే భగవంతుడు కోపిస్తాడు. ఎడమచేత్తో ఏదైనా చేస్తే మంచిది కాదు... ఇలాంటి విశ్వాసాలు చాలా ఉండేవి. దీనివల్ల ప్రజలు క్రమంగా ఛాందసులుగా మారారు. ప్రతిదీ మూఢంగా, అంధ విశ్వాసంతో ఆచరించడం ప్రారంభించారు. వారు చాలా కోపిష్టులుగా మారారు. వారిలో ఆనందం, ఉత్సాహం మాయమైపోయాయి. అతి ధర్మాచరణ వల్ల మనుషుల్లో కరువైన ఆనందాన్ని తిరిగి తేవాలనే ఆలోచనతో... శ్రీకృష్ణుడు రంగులతో హోలీ ఆడే సంప్రదాయాన్ని ప్రారంభించాడు. "ఇప్పుడు మీరు మీ ఆత్మ వైపు మరలండి. చిన్న చిన్న విషయాలలో మునిగిపోవాల్సిన అవసరం లేదు. మీ దృష్టిని ఉన్నతమైన విషయాల మీద మరల్చాలి" అని చెప్పాడు. మన సూక్ష్మ శరీరంలో కుడివైపు హృదయ చక్రంలో శ్రీరాముడు, గొంతు దగ్గర ఉండే విశుద్ధ చక్రంలో శ్రీకృష్ణుడు ఉంటారు. సామూహికత, ఆనందం, సంఘ శక్తి... ఇవన్నీ విశుద్ధ చక్రం ఆశీస్సులే. అలాగే మనలోని సూక్ష్మ శరీరంలో ఉండే ఏడు శక్తి కేంద్రాలు భిన్నమైన రంగులను కలిగి ఉంటాయి. మూలాధార చక్రం ఎర్రగా, స్వాధిష్ఠాన చక్రం పసుపుగా, మణిపూరక చక్రం ఆకుపచ్చగా, అనాహత చక్రం గులాబీ రంగులో, విశుద్ధ చక్రం నీలంగా, ఆజ్ఞా చక్రం తెల్లగా, సహస్రార చక్రం సప్తవర్ణాల సమ్మిళితంగా ఉంటాయి. "ఆ చక్రాల తాలూకు అన్ని రంగులను మీమీద చల్లుకోండి. ఆనందంతో, ఉత్సాహంతో, ఉల్లాసంతో ఆడుకోండి. అంత గంభీరంగా ఉండాల్సిన అవసరం ఏమిటి? మీరు భగవంతుణ్ణి చేరినట్టయితే సంతోషంగా ఎందుకులేరు?" అంటూ శ్రీకృష్ణుడు హోలీని ప్రోత్సహించాడు" అని నిర్మలాదేవి వెల్లడించారు.

సభ్యతగా, మర్యాదగా...

కాబట్టి హోలికా దహనం తరువాత జరుపుకొనే హోలీ... దీపావళిలా ఉండాలి. దాని ఆనందం అఖండంగా ఉండాలి. సాధారణ రోజుల్లో ఆర్థిక స్థాయిలు, హోదాల వల్ల కలవని వారు కూడా హోలీ రోజున కలిసిపోతారు. యజమానులు, సేవకులు, బీదా గొప్పా అనే తేడాలు లేకుండా అందరూ ఈ రంగుల ఉత్సవంలో సంతోషంగా పాల్గొంటారు. మన దేశంలో హోలీ అనే ఈ సామాజిక, సామూహిక వేడుక ఈ విధంగానే ప్రారంభమయింది. కాలక్రమేణా ఈ ఉత్సవాలలోనూ పెడధోరణులు చోటుచేసుకున్నాయి. 'సభ్యత, మర్యాద ఉండేదే అసలైన వేడుక' అని గుర్తుంచుకోవాలి. ప్రపంచవ్యాప్తంగా సహజయోగులు హోలీ పండుగను కామ దహనానికి ప్రతీకగా జరుపుకొంటారు. అగ్ని దేవతను హోమ రూపంలో పూజిస్తారు.

డాక్టర్ పి. రాకేష్, 8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి,
సహజయోగ ట్రస్ట్', తెలంగాణ

సుభాషితం



స్థాయికి తగిన ప్రతిఫలం


స్నాయువసావశేష మలినమ్మగు
నెమ్ము గ్రహించి జాగిలం
బాయతమోదమందు జన దాకలి
దానికి జెంతనున్న గో
మాయువు దాని జూచి
పరిమార్చక సింగము దంతి
గూల్చు నీ
చాయల నెల్లవారు నిజసత్త్వ
సమాన ఫలార్థులే గదా!

భర్తృహరి తన 'నీతిశతకం'లో రచించిన 'స్వల్ప స్నాయు వసావసేక మలినం...' అనే శ్లోకాన్ని తెలుగువారికి ఏనుగు లక్ష్మణకవి ఈ పద్యం ద్వారా అందించారు.

భావం: అసహ్యమైన వాసన వేస్తున్న చిన్న ఎముక దొరికినా, దానిలో మాంసం లేకపోయినా... శునకం ఆ ఎముకను నాకుతూ సంతృప్తి పడుతుంది. కానీ దానివల్ల ఆ శునకం ఆకలి తీరదు. కానీ మృగరాజైన సింహం తన ఎదురుగా నక్కల్లాంటి జీవులు తిరుగుతున్నా వాటిని వదిలిపెట్టి, మదగజాన్ని వెతికి వేటాడుతుంది. జీవులన్నీ తమ శక్తి సామర్థ్యాలకు తగిన ఫలితాన్నే ఆశిస్తాయి. సమర్థత ఉన్నవారు తక్కువ ఫలితం కోసం పాకులాడకుండా తమ స్థాయికి తగిన ప్రతిఫలం కోసం ప్రయత్నిస్తారు.

గీతాసారం

నిస్వార్థంగా మెలగాలి



పనులను (కర్మలను) ఎలాంటి స్వార్థం లేకుండా ఆచరించడం అత్యుత్తమైన లక్షణమని, అటువంటి నిస్వార్థమైన కర్మలు సర్వోన్నతమైన శక్తిని కలిగి ఉంటాయని శ్రీకృష్ణుడు చెప్పాడు. నిస్వార్థమైన చర్యల గురించి వివరించడానికి వర్షాన్ని ఆయన ఉదాహరణగా తీసుకున్నాడు. వేడి కారణంగా నీరు ఆవిరై మేఘాలు ఏర్పడతాయి. అనుకూలమైన పరిస్థితుల్లో అది వర్షం రూపంలో తిరిగి భూమి మీదకు వస్తుంది. అంటే వర్షం అనేది ఒక ఆవృత్తి (సైకిల్)లో భాగం. నిస్వార్థ కర్మలను 'యజ్ఞం'గా శ్రీకృష్ణుడు పేర్కొన్నాడు. మహా సముద్రాలు నీటిని ఆవిరి చేసి, మేఘాలు ఏర్పడడానికి సహాయపడతాయి. వర్షంగా మారడం కోసం మేఘాలు కరుగుతాయి, తమనుతాము త్యాగం చేసుకుంటాయి. ఈ రెండూ యజ్ఞరూపమైన నిస్వార్థ కర్మలు. ఇవి అత్యంత శక్తిని గలిగి ఉంటాయనీ, ఆరంభంలో సృష్టికర్త ఈ శక్తిని ఉపయోగించి సృష్టిని చేశాడనీ, ప్రతి ఒక్కరూ దీన్ని ఉపయోగించుకొని పరమ శ్రేయస్సును పొందాలని సూచించాడనీ 'భగవద్గీత' మూడో అధ్యాయంలో శ్రీకృష్ణుడు వివరించాడు. ఇదంతా యజ్ఞరూపమైన నిస్వార్థ కర్మ ద్వారా మన అస్తిత్వంతో మనల్ని అనుసంధానించుకొని... దాని శక్తిని ఉపయోగించుకోవడమే.

వర్షానికి సంబంధించిన ఈ పరస్పర అనుసంధాన ప్రక్రియలో.. మేఘాలు గర్వంతో నీటిని నిల్వ (జమ) చేసుకుంటే ఆ ఆవృత్తికి భంగం కలుగుతుంది. "ఇలా భంగం కలిగించేవారు దాచుకొనేవారు దొంగలు. వర్షం తాలూకు నిస్వార్థ కర్మ కొనసాగినప్పుడు... మేఘాలు మళ్ళీ, మళ్ళీ ఏర్పడుతూనే ఉంటాయి" అని శ్రీకృష్ణుడు చెబుతూ... పరస్పరం సహాయం చేసుకొనేవారిని దేవతలుగా సంబోధించాడు. సముద్రం వర్షం ద్వారా నీటిని తిరిగి పొందినట్టే... నిస్వార్థ కర్మలు ఎన్నిటినో తిరిగి ఇస్తాయి. కాబట్టి దాచుకోకుండా ఆవృత్తిలో భాగం కావాలనీ, అది అన్ని పాపాలనుంచి మిమ్మల్ని విముక్తి చేస్తుందనీ, దాచుకోవడమే అసలైన పాపం అని ఆయన స్పష్టం చేశాడు. స్వార్థ కర్మలు మనల్ని కర్మబంధనంలో బంధిస్తాయని హెచ్చరించాడు. అనుబంధం పెంచుకోకుండా కర్మలను యజ్ఞంలా నిర్వహించాలని సూచించాడు.

ఈ భౌతిక ప్రపంచంలో ఒకరిపై మరొకరు ఆధారపడడం తప్ప మరో మార్గం లేదు. ఇక్కడ ప్రతి వస్తువు, ప్రతి జీవి ఒక ఆవృత్తిలో లేదా మరొకదానిలో భాగం. అది మరో వస్తువు మీద లేదా మరొకరిమీద ఆధారపడి ఉంటుంది. మనలోని ఒక భాగం ఇతరులలో... ఇతరులలోని ఒక భాగం మనలో ఉంటుందనే అవగాహన కీలకం.

కె. శివప్రసాద్
ఐఏఎస్

పర్వదినం

అదే హోలీ సందేశం

ఆధ్యాత్మికతకు, ఆరాధనాతత్త్వానికి సమన్వయ స్వరూపమే హోలీ మహోత్సవ అంతరార్థం. ఊరూవాడా, చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ ఆనందోత్సాహాలతో జరుపుకొనే పండుగ హోలీ. సర్వమానవ సౌభ్రాతృత్వానికి నిదర్శనంగా నిలిచే పర్వదినం. ఫాల్గుణ పూర్ణిమను హోలీ పూర్ణిమగా వ్యవహరిస్తారు. అలాగే 'కాముని పున్నమి', 'కామదహనం', 'ఫాల్గుణోత్సవం' అని కూడా పిలుస్తారు. ఈ పండుగ ప్రస్తావన వివిధ పురాణాలతో పాటు హాలుడి 'గాథా సప్తశతి', వాత్స్యాయనుడి 'కామసూత్రాలు', కాళిదాసు 'మాళవికాగ్నిమిత్రం', దండి 'దశకుమార చరిత్రం' తదితర కావ్యాల్లో విస్తారంగా ఉంది. విదేశీ యాత్రికులైన అల్ బిరూనీ, నికోలో కాంటే... భారతదేశంలో ప్రజలు ఆనందోత్సాహాలతో చేసుకొనే హోలీ వేడుకను 'వసంతోత్సవం'గా వర్ణించారు.

హోలీ అనగానే మనలో ముందుగా మెదిలేది రాధా మాధవుల జీవాత్మ-పరమాత్మల సంయోగమే. బృందావనంలో వారిరువురి ప్రణయ జీవనాన్నీ కథలు కథలుగా చెప్పుకొంటున్నాం. వాటిలో హోలీ వైభవమంతా గోచరించి, మనల్ని తన్మయత్వంలో ముంచుతుంది. హిందువుల సంస్కృతీ సంప్రదాయాలకు, ధార్మికతకు, ఆధ్యాత్మిక వైభవానికి నిలువెత్తు దర్పణం.... హోలీ. వసంతకాల ఆగమనం, కొత్త పంటల రాక, శీతగాలులు తొలగి వెచ్చని కిరణాల సోయగంతో భానుడి ప్రకాశం, పున్నమి పవిత్రత, రంగుల విశిష్టత, అందరిమధ్యా సౌభ్రాతృత్వం వెల్లి విరియడం... ఇవన్నీ హోలీ పర్వంలో చూడగలం. హోలీ... వెలుగుకు మేలుకొలుపు. ఇది వ్యక్తిగత ఆకాంక్షలకు, ఆశయాలకు, సర్వ చైతన్య భావస్ఫూర్తికి ప్రతిబింబంగా గోచరిస్తుంది.



హోళికా పూర్ణిమకు సంబంధించిన ఎన్నో కథలు ప్రచారంలో ఉన్నాయి. తారకాసుర సంహారానికి కుమారస్వామి జన్మించడానికి వెనుక మన్మథుణ్ణి శివుడు దహించాడు. రతీదేవి ప్రార్థనకు చలించిన శివుడు ఆమెకు వరాన్ని ప్రసాదించాడు. ఆ రోజు ఫాల్గుణ పూర్ణిమ. మరో కథ ప్రకారం... హోలిక అనే రాక్షసి మరణించిన రోజును హోలీగా పున్నమిగా నిర్వహించుకుంటున్నాం. ఆమె హిరణ్యకశిపుడి సోదరి అని కూడా కొన్ని గ్రంథాలు పేర్కొన్నాయి. ఇలా ఎన్నో కథలు ఉన్నప్పటికీ... ప్రధానంగా శ్రీకృష్ణుడితోనే హోలీ ఎక్కువగా ముడిపడి ఉంది. ఈ రోజున చిన్ని కృష్ణుణ్ణి ఊయలలో ఉంచి, ఉత్సవం నిర్వహిస్తారు. ఉత్కళ, వంగ రాష్ట్రాల్లో దీన్ని డోలోత్సవంగా జరుపుకొంటారు. కాగా, ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకూర్మంలో కూడా ఈ ఉత్సవం వైభవంగా జరుగుతుంది.

హోలీ రంగులు మనిషి ధార్మిక జీవనానికి మార్గదర్శులు. సప్తవర్ణాల సమ్మేళనమే తెలుపు. ఇది శాంతికి, సౌజన్యానికి ప్రతీక. కాంతిని పెంచేది ఎరుపు, భాగ్యాన్ని అందించేది పసుపు. వీటి విలక్షణతను అవగాహన చేసుకొని, జగమంతా 'రంగులమయం, రసమయం' అనే భావాన్ని అందిపుచ్చుకోవాలి. ప్రకృతిలో సహజంగా ఉన్న అన్ని వర్ణాల సౌందర్యాన్ని ఆస్వాదించాలి. అదే హోలీ ఉత్సవంలోని సందేశం.

• ఆయపిళ్ళ రాజపాప







నాని నమ్మకం నిజమైంది

ప్రశాంతి తిపిర్నేని




'హిట్' సిరీస్ చిత్రాల నిర్మాత ప్రశాంతి తిపిర్నేని తాజా చిత్రం 'కోర్ట్'. వాల్ పోస్టర్ సినిమా పతాకంపై నాని సమర్పణలో ప్రియదర్శి కథానాయకుడిగా రామ్ జగదీశ్ తెరకెక్కించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా నిర్మాత ప్రశాంతి, సహ నిర్మాత దీప్తి మీడియాతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ప్రశాంతి మాట్లాడుతూ "ఈ కథను దర్శకుడు రామ్‌జగదీశ్ చాలా బాగా రాశారు. చాలా లేయర్స్ ఉన్న ఈ సినిమా స్క్రీన్‌ప్లే అందరినీ ఆకట్టుకునేలా ఉంటుంది. పెయిడ్ ప్రీమియర్స్‌కు అద్భుత స్పందన వస్తోంది. ముఖ్యంగా సెకండాఫ్‌ను ప్రేక్షకులు విపరీతంగా ఇష్టపడుతున్నారు. ప్రీమియర్స్‌కు వచ్చిన కొందరు లాయర్స్ సినిమా చాలా సహజంగా ఉందని మెచ్చుకున్నారు. సినిమాల విషయంలో నాని జడ్జిమెంట్ తప్పు కాదని 'కోర్ట్'తో మరోసారి రుజువైంది. ఇందులో ప్రియదర్శి పాత్ర ఆయన కెరీర్‌లోనే ప్రత్యేకంగా నిలిచిపోతుంది. మంగపతిగా నటించిన శివాజీ పాత్రనూ ప్రేక్షకులు బాగా రిసీవ్ చేసుకున్నారు. 'హిట్ 3' విడుదల తర్వాత కొత్త ప్రాజెక్ట్‌ను ప్రకటిస్తాం" అని అన్నారు. సహ నిర్మాత దీప్తి మాట్లాడుతూ "రామ్ జగదీశ్ మంచి ప్రతిభావంతుడు. ఈ కోర్ట్ రూమ్ డ్రామాను చాలా ఆసక్తికరంగా మలిచాడు. సినిమాలోని ప్రతీ పాత్ర గుర్తుండిపోతుంది. సినిమా కచ్చితంగా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తుంది. భావోద్వేగాలు, కోర్ట్ సన్నివేశాలు, సంగీతం సినిమాకు ప్రధానాకర్షణ" అని చెప్పారు.

చాలా బాగుంది శ్రుతీ




కథానాయికగా దక్షిణాదిన సత్తా చాటిన శ్రుతీహాసన్ కొన్ని హిందీ చిత్రాల్లోనూ కనిపించారు. 'ద ఐ' చిత్రంతో ఆమె హాలీవుడ్ అరంగేట్రం చేయబోతున్నారు. ఇటీవలే చిత్ర బృందం శ్రుతి పాత్రను పరిచయం చేస్తూ ట్రైలర్‌ను విడుదల చేసింది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ చిత్రం ట్రైలర్‌ను షేర్ చేసిన నయనతార 'చాలా బాగుంది శ్రుతీ' అంటూ ప్రశంసించారు. ట్రైలర్‌లో శ్రుతి నటన అద్భుతంగా ఉందని మెచ్చుకున్నారు. 'ద ఐ'తో హాలీవుడ్‌లో శ్రుతికి శుభారంభం దక్కాలని ఆకాంక్షించారు. ఇప్పటికే పలు అంతర్జాతీయ చిత్రోత్సవాల్లో 'ద ఐ' చిత్రాన్ని ప్రదర్శించారు. 'నా కెరీర్‌లో ఇదో డిఫరెంట్ మూవీ అవుతుంది' అని శ్రుతీహాసన్ పేర్కొన్నారు. డాఫ్నే ష్మోన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మార్క్‌రౌలీ కీలకపాత్ర పోషించారు. భర్త ఫెలిక్స్ కోసం అన్వేషిస్తూ సాగించే ప్రయాణం నేపథ్యంలో సైకలాజికల్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం తెరకెక్కింది. ఇందులో శ్రుతి డయానా అనే పాత్ర పోషించారు. ప్రస్తుతం రజనీకాంత్ 'కూలీ' చిత్రంలో ఆమె నటిస్తున్నారు.

జీవితంలోనూ ఛాంపియన్



నటుడు శ్రీకాంత్ తనయుడు రోషన్ నటిస్తున్న తాజా చిత్రం 'ఛాంపియన్'. ఈ పీరియాడిక్ స్పోర్ట్స్ డ్రామాకు ప్రదీప్ అద్వైతం దర్శకుడు. ఇప్పటికే విడుదలైన చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్ అందరినీ ఆకట్టుకుంది. రోషన్ పుట్టినరోజు సందర్భంగా గ్లింప్స్ విడుదల చేశారు. ఇందులో ఫుట్‌బాల్ ఆటగాడిగా రోషన్‌ను పరిచయం చేశారు. బ్రిటీషు పాలనకు వ్యతిరేకంగా, ధైర్యంగా నిలబడడం ఆకట్టుకుంది. మైదానంలోనే కాదు జీవితంలో కూడా నిజమైన ఛాంపియన్‌గా ఎదగడానికి చేసే పోరాటంగా ఈ చిత్రం ఉండబోతోంది. మిక్కీ జే మేయర్ అందించిన నేపథ్య సంగీతం హైలైట్‌గా నిలిచింది. తోట తరణి కళా దర్శకత్వం ఈ చిత్రం గొప్పతనాన్ని మరింత పెంచుతుంది. స్వాతంత్ర్యానికి పూర్వం జరిగిన కథతో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని స్వప్న సినిమా, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్ సంస్థలు నిర్మిస్తున్నాయి.

ప్రేక్షకులతో విజిల్స్ వేయిస్తాం

కిరణ్ అబ్బవరం



కిరణ్ అబ్బవరం, రుక్సర్ ధిల్లాన్ జంటగా నటించిన చిత్రం 'దిల్‌రూబా'. విశ్వకరుణ్ దర్శకత్వంలో రవి, జోజో జోస్, రాకేశ్‌రెడ్డి, సారెగమ నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతోన్న సందర్భంగా చిత్రబృందం మీడియాతో ముచ్చటించింది. ఈ కార్యక్రమంలో హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ "ప్రేమ, స్నేహంతో పాటు కుటుంబ విలువలు కలగలసిన అద్భుతమైన కథ ఇది. కథనం చాలా కొత్తగా ఉంటుంది. దర్శకుడు విశ్వ కరుణ్ సినిమాలో రాసిన డైలాగ్స్, సన్నివేశాలు ప్రేక్షకులతో విజిల్స్ వేయిస్తాయి. యూత్‌తో పాటు ఫ్యామిలీస్‌కు కనెక్ట్ అయ్యే చిత్రమిది. నటుడిగా నన్ను మరో మెట్టు ఎక్కించే ఈ చిత్రం నా కెరీర్‌లో ప్రత్యేకం. సినిమా తప్పకుండా అందరికీ మంచి వినోదాన్ని అందిస్తుంది. విజయంపై పూర్తి నమ్మకముంది" అని చెప్పారు. దర్శకుడు విశ్వకరుణ్ మాట్లాడుతూ "మనుషుల మధ్య తగ్గిపోయిన విలువలు, బంధాలను ఈ సినిమా తిరిగి గుర్తుచేస్తుంది. మంచి లవ్‌స్టోరీతో పాటు మాస్ ప్రేక్షకులను మెప్పించే ఫైట్స్ ఇందులో ఉన్నాయి. ఈ సినిమా ట్రైలర్ చూసిన దర్శకులు పూరి జగన్నాథ్, మెహర్ రమేశ్ ఫోన్ చేసి అభినందించారు. కిరణ్‌ను కొత్తగా చూపించే చిత్రమిది" అని అన్నారు. హీరోయిన్ క్యాతీ డేవిసన్ మాట్లాడుతూ "ఇందులో మ్యాగీ పాత్రను పోషించాను. ఇటువంటి మంచి రోల్ దక్కడం నా అదృష్టం. సినిమా చూసిన ప్రతీ ఒక్కరూ భావోద్వేగానికి లోనవుతారు" అని తెలిపారు.

శక్తిమంతమైన లుక్‌లో...



తమిళ కథానాయకుడు విజయ్ ఆంటోని కథానాయకుడిగా నటిస్తూ, నిర్మిస్తున్న తాజా చిత్రం 'భద్రకాళి'. ఆయనకు ఇది 25వ చిత్రం కావడం విశేషం. అరుణ్ ప్రభు దర్శకుడు. ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. విజయ్ ఆంటోని ఇందులో ఫ్యామిలీ మ్యాన్‌గా, గ్యాంగ్‌స్టర్‌గా, ఉన్నతాధికారిగా పలు శక్తిమంతమైన లుక్స్‌లో కనిపించారు. సంభాషణలు, విజువల్స్ ఆకట్టుకున్నాయి. త్వరలోనే సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ సినిమా విజయ్ కెరీర్‌లోనే ప్రత్యేకంగా నిలిచిపోతుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి ఎడిటింగ్: రేమండ్ డెరిక్ క్రాస్టా, సినిమాటోగ్రఫీ: షెల్లీ కాలిస్ట్, సంగీతం: విజయ్ ఆంటోని.

ఆమెతో డేటింగ్‌లో ఉన్నా



తన స్నేహితురాలు గౌరీ స్ప్రాట్‌తో ఏడాదిన్నరగా డేటింగ్‌లో ఉన్నట్లు బాలీవుడ్ హీరో ఆమిర్‌ఖాన్ వెల్లడించారు. ఆమెతో తనది పాతికేళ్ల పరిచయం అన్నారు. ప్రస్తుతం గౌరీ తన ప్రొడక్షన్ హౌస్‌లో పనిచేస్తున్నట్లు తెలిపారు. నేడు ఆమిర్‌ఖాన్ 60వ పుట్టిన రోజు. ఈ సందర్భంగా గురువారం నిర్వహించిన పుట్టిన రోజు వేడుకల్లో ఆయన గౌరీ స్ప్రాట్‌తో తన అనుబంధాన్ని మీడియాతో పంచుకున్నారు. గౌరీ స్ప్రాట్ ప్రస్తుతం బెంగళూరులో ఉంటున్నారనీ, ఆమెకు గతంలో పెళ్లైందనీ, ఆరేళ్ల కుమారుడు కూడా ఉన్నాడని చెప్పారు. నాతో పాటు మా కుటుంబ సభ్యులు కూడా ఆమెతో అనుబంధం పట్ల సంతోషంగా ఉన్నట్లు తెలిపారు. పుట్టిన రోజు సందర్భంగా నా స్నేహితులు షారూఖ్‌ఖాన్, సల్మాన్‌ఖాన్‌కు ఇచ్చిన పార్టీకి కూడా గౌరి హాజరయినట్లు తెలిపారు. గతంలో రీనాదత్తా, కిరణ్‌రావును వివాహం చేసుకొన్న ఆమిర్ కొన్నాళ్ల తర్వాత విడాకులు తీసుకున్నారు.

కడుపుబ్బా నవ్వించే చిత్రం



కమెడియన్ సప్తగిరి కథానాయకుడిగా అభిలాశ్ రెడ్డి గోపిడి తెరకెక్కించిన వినోదాత్మక చిత్రం 'పెళ్లికాని ప్రసాద్'. దిల్‌రాజు సమర్పణలో కె.వై.బాబు, భానుప్రకాష్ గౌడ్, సుక్కా వెంకటేశ్వర్ గౌడ్, వైభవ్‌రెడ్డి ముత్యాల నిర్మించారు. ఈ నెల 21న సినిమా విడుదలవుతుంది. తాజాగా, ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. "36 ఏళ్లు వచ్చినా పెళ్లికాని ఓ వ్యక్తి కథ ఇది. సినిమా కడుపుబ్బా నవ్విస్తుంది. సప్తగిరి మార్క్ వినోదం గ్యారంటీ" అని మేకర్స్ తెలిపారు. శ్రీనివాస్, మురళీధర్ గౌడ్, లక్ష్మణ్, రోహిణి, ప్రియాంక శర్మ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి ఎడిటర్: మధు, డీఓపీ: సుజాత సిద్ధార్థ్, సంగీతం: శేఖర్ చంద్ర.





బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	90, 97, 107
చికెన్ విత్ స్కిన్	170
చికెన్ స్కిన్‌లెస్	180

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

వైభవంగా రామలింగేశ్వరస్వామి కల్యాణం

కూచిపూడి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): బాలాత్రిపుర సుందరిదేవి సమేత రామలింగేశ్వరస్వామివారి కల్యాణం గురువారం వేకువ జామున వైభవంగా నిర్వహించారు. వేదపండితులు మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ స్వామి, అమ్మవారి కళ్యాణ వేడుకలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఈ సందర్భంగా కల్యాణ దంపతులను నంది వాహనంపై మంగళవాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించారు. భక్తుల కోలాహలం నడుమ రథోత్సవ వేడుకలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

హుండీ లెక్కింపు రేపు

పామర్రు,మార్చి13(ఆంధ్రజ్యోతి): పామర్రు పరిధిలోగల ఉండ్రపూడి-పోలవరం క్రాస్ రోడ్డులోగల వీరాంజనేయ స్వామి దేవస్థానం హుండీ లెక్కింపు ఈనెల 15న నిర్వహించనున్నట్టు ఆలయ అధికారి పీవీఎన్‌వీ ప్రసాదరావు గురువారం తెలిపారు. ఆసక్తి గల వారు లెక్కింపులో పాల్గొనవలసిందిగా కోరారు.

పదోతరగతి పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధం

పామర్రు,మార్చి13(ఆంధ్రజ్యోతి): ఈనెల17 నుంచి జరగనున్న పదోతరగతి వార్షిక పరీక్షల నిర్వహణ నిమిత్తం పామర్రు మండల పరిధిలో ఐదు పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేసినట్టు మండల విద్యాశాఖదికారి గుమ్మడి పద్మవాణి గురువారం తెలిపారు. పామర్రు పట్టణంలో కంచర్ల రామారావు జిల్లాపరిషత్ హైస్కూల్లో-1, ఏఎన్‌ఎం ఇంగ్లీష్‌మీడియం హైస్కూల్లో ఒక్కోటితోపాటుగా నిమ్మకూరులోని అడ్డాడ జెడ్పీహైస్కూల్లో ఓ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు.

అసంపూర్తి భవనాలను పూర్తి చేయరూ..

(ఆంధ్రజ్యోతి - పెదపారుపూడి) : వైసీపీ హయాంలో పెదపారుపూడిలో అట్టహాసంగా ప్రారంభించిన రైతు భరోసా కేంద్రం, సచివాలయాల భవన నిర్మాణపు పనులు నేటికీ అసంపూర్తిగానే మిగిలిపోయాయి. సచివాలయ భవన నిర్మాణానికి రూ.40 లక్షలు , రైతు భరోసా కేంద్రం భవన నిర్మాణానికి రూ.19.62 లక్షల చొప్పున ఎంజీఎన్ ఆర్‌ఈజీఎస్ నుంచి నిధులు మంజూరయ్యాయి. దీంతోపాటుగా వ్యవసాయ శాఖ నుంచి రూ.2.18 లక్షల నిధులు మంజూరయ్యాయి. 2020లో ఈ భవనాలకు పెదపారుపూడి మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ శంకుస్థాపన చేశారు. ఇప్పటికీ ఆ భవనాల నిర్మాణపు పనులు పూర్తవలేదు. ఇప్పటికైనా సదరు అధికారులు దృష్టి సారించి అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణ పనులను పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నిర్మాణ పనులు పూర్తి కాలేదు



వైసీపీ హయాంలో గ్రామ సచివాలయం , రైతు భరోసా కేంద్రం భవనాల నిర్మాణపు పనులు ప్రారంభించారు. ఇప్పటికీ ఆ భవనాల నిర్మాణపు పనులు పూర్తిస్థాయిలో జరుగలేదు.

గారపాటి వీర నాగబాబురావు

పనులు పూర్తి చేస్తాం

రైతుభరోసా కేంద్రం, సచివాలయాల భవన నిర్మాణపు పనులు ఇప్పటికీ పూర్తికాలేదు. సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు చేపడతాం.

టి.సీతామహాలక్ష్మి, ఎంపీడీవో



పెదపారుపూడి సచివాలయ భవనం

చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధే లక్ష్యం

గుడివాడ రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చిన్న, మధ్య తరగతి పరిశ్రమలను ప్రోత్సహించటానికి అనేక రాయితీలు, సబ్సిడీలు అందిస్తుందని జిల్లా పరిశ్రమల ప్రమోషన్ అధికారి మనోజ్ అన్నారు. గుడివాడ మండల పరిషత్ కార్యాలయంలో చిన్న, మధ్య తరహా పరిశ్రమలు అభివృద్ధి చేయటానికి తగు సూచనలు, సలహాలు అందించారు. చిన్న పారిశ్రామిక వేత్తలతో ఆయన మాట్లాడుతూ పరిశ్రమలకు అన్ని వసతులు ఏర్పాటు చేయటానికి కృషి చేస్తామన్నారు. పారిశ్రామిక వేత్తలు నిజాయితీ, నిబద్ధతతో పని చేయాలని కోరారు. డిప్యూటీ డైరెక్టర్ వి.సంజన్, ఎంపీడీవో విష్ణు ప్రసాద్, రూరల్, అర్బన్, పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న మనోజ్

ప్లాస్టిక్ బ్యాగుల నిషేధం

గుడ్లవల్లేరు :గుడ్లవల్లేరు పంచాయితీ పరిధిలో ప్లాస్టిక్ క్యారీబ్యాగుల నిషేధించామని ఎవ్వరూ వాటిని వినియోగించవద్దని పంచాయితీ కార్యదర్శి నరసింహారావు అన్నారు. గురువారం పంచాయితీ సిబ్బంది గ్రామంలోని అన్ని కిరాణా, కూరగాయల, వివిధ వ్యాపార దుకాణాలకు వెళ్లి క్యారీ పాలితిన్ బ్యాగ్‌లు అమ్మడం కానీ, ఇవ్వడం కానీ చేయరాదని విజ్ఞప్తి చేశారు. అలానే శనివారం స్థానిక పంచాయితీ కార్యాలయం వద్ద నిర్వహించనున్న అవగాహనా కార్యక్రమానికి దుకాణ దారులంతా హాజరుకావాలని సూచించారు.

ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు అందించాలి

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

పామర్రు,మార్చి13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జుజ్జవరం గ్రామంలో పాలకుల నిర్లక్ష్యంతో గ్రామస్థులకు తప్పని తాగునీటి కష్టాలు అనే ఆంధ్రజ్యోతిలో 10తేదీన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం పట్ల ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సత్యన్నారాయణ స్పందించారు. గురువారం గ్రామంలోని సంబంధిత తాగునీటి చెరువును ఆయన పరిశీలించారు. తక్షణమే చెరువులో గల నాచు, ఇతర వ్యర్థాలను తొలగించాలని పంచాయతీ కార్యదర్శికి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలను ఆదేశించారు. వేసవికాలం దృష్ట్యా ప్రజలకు తాగునీటి సరఫరాలకు అవసరమైన ఎక్కువ సామర్థ్యం గల పంచాయతీ నిధులతో కొనుగోలు చేయాలని సూచించారు. ప్రజలకు స్వచ్ఛమైన నీటి సరఫరాకు తీసుకోవాల్సిన చర్యలను, నీటిని ఫిల్టరింగ్ చేసేందుకు అవసరమైన అంశాలను స్థానిక అధికారులకు డీఈ వివరించారు. చెరువు పరిశుభ్రతతోపాటు నీటిలో అవసరం మెరకు క్లోరిన్, బ్లీచింగ్‌లు కలపిన నీటిని ప్రజలకు అందించాలని కోరారు. ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి గ్రామస్థులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వార్డుసభ్యులు చెన్నకేశవులు పాల్గొన్నారు.



చెరువును పరిశీలిస్తున్న డీఈ సత్యన్నారాయణ

మినుము పంట పరిశీలన

గుడివాడ రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి):రైతులు పంటను త్వరగా నూర్చి ఇంటికి చేర్చుకోవాలని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి అన్నారు. గురువారం చిరుచింతల గ్రామంలో ఓ రైతు పురుగు మందులు చల్లటం వల్ల మినుము ఎక్కువగా పంట దిగుబడి రాలేదని పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేయగా, పరిశీలనకు గురువారం శాస్త్రవేత్తలు వచ్చారు. ఆ రైతు పొలాన్ని పరిశీలించి ఏ మందు చల్లారు, ఎంత దిగుబడి వచ్చిందో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతీ రైతు జాగ్రత్తలు తీసుకోవాలని, ఎరువుల షాపులో ఏ మందు పడితే ఆ మందు పిచికారి చేస్తే దుష్ప్రరిణామాలు కలుగుతాయని తెలిపారు. రైతులు వ్యవసాయ శాఖాధికారులు సూచించిన ప్రకారం మందులు చల్లుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త లహరి, మండల వ్యవసాయాధికారిణి బోలెం అనంతలక్ష్మి, వీఏఏ శ్రీకాంత్ పాల్గొన్నారు.



చిరుచింతలలో మినుము పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

గుర్తు తెలియని మహిళ మృతి

గుడివాడ, మార్చి 13(ఆంధ్రజ్యోతి) : స్థానిక మోటూరు రైల్వేస్టేషన్ నుంచి మండవల్లి రైల్వే స్టేషన్‌కు వెళ్లే దారిలో రైలు నుంచి జారిపడి ఓ గుర్తు తెలియని మహిళ మృతి చెందినట్టు రైల్వే ఎస్సై మహబూబ్ షరీఫ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళ వయస్సు సుమారు 30 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉంటుందన్నారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు స్థానిక గుడివాడ ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్‌లో తెలపాలని ఎస్సై కోరారు.

భగవద్గీత పంపిణీ

గుడివాడ : స్థానిక మాంటిస్సోరి ఇంగ్లీషు మీడియం ఉన్నత పాఠశాలలో గురువారం తిరుమల, తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో "మానవులందరికి భగవద్గీత" శీర్షిక కలిగిన భగవద్గీత పుస్తకాలను అందజేశారు. తిరుమల తిరుపతి దేవస్థాన విశిష్ట ధర్మాచార్య కావూరి శ్రీధర్, పాఠశాల అధ్యక్షులు వల్లూరుపల్లి లక్ష్మీ, మహిళ సంఘం సభ్యులు వి.జయవేణిలు పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జి.పద్మావతి, విద్యార్థులు పాల్గొన్నారు.

రీయూజబుల్ ప్లాస్టిక్‌ను వాడండి : మున్సిపల్ కమిషనర్

గుడివాడ: సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ వాడుకను తగ్గించాలని, రీయూజబుల్ ప్లాస్టిక్‌ను వాడాలని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని వ్యాపార సంస్థలు, పాఠశాలలు, కళాశాలలు, స్వచ్ఛంద సంస్థల వారు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులుంటే వెంటనే పురపాలక సంఘ కార్యాలయంలో అందజేయాలని కోరారు. అందించిన సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌ను సిమెంట్ ఫ్యాక్టరీలకు పంపుతామని ఆయన తెలిపారు.

ఘనంగా ల్యాబ్ టెక్నీషియన్స్‌డే

గుడివాడ, మార్చి 13(ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రాంతీయ ప్రభుత్వాసుపత్రిలో గురువారం వరల్డ్ ల్యాబ్ టెక్నీషియన్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డి.సి.హెచ్ డాక్టర్ జయకుమార్‌ను గ్రేడ్-2గా ఉన్న ల్యాబ్ టెక్నీషియన్‌లను గ్రేడ్-1 లేదా సూపర్‌వైజర్లుగా పదోన్నతి కల్పించాలని ఎన్‌జీవోస్ నాయకులు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం, వైద్య శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ల్యాబ్ టెక్నీషియన్లు షేక్ ఫరీద్ భాషా, ఎం.కోటేశ్వరరావు, పార్వతి, లక్ష్మణ్‌లను ఘనంగా సత్కరించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఇందిరాదేవి, వైద్యులు డాక్టర్ జయప్రభ, డాక్టర్ రవి, డాక్టర్ కృష్ణగిరీష్, డాక్టర్ వెంకటేష్, డాక్టర్ విజయశ్రీ, సిబ్బంది ఉషశ్రీ, ఉమాదేవి, సరిత తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యాబోధనే లక్ష్యం : ఎంఈవో



సాంస్కృతి ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

పామర్రు,మార్చి13(ఆంధ్రజ్యోతి): నైతిక విలువలతోకూడిన విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని పామర్రు ఎంఈవో గుమ్మడి పద్మవాణి అన్నారు. స్థానిక ఏఎన్‌ఎం ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో గురువారం సాయత్రం పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. విద్యార్థి జీవితానికి పదోతరగతి కీలకదశగా భావించాలన్నారు. పరీక్షలంటే భయాన్ని విడనాడి ఆత్మస్థైర్యంతో ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తుకు ప్రణాళికలు రచించుకుని విద్యాపరంగా ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. తొమ్మిదోతరగతి విద్యార్థులు, పదోతరగతి విద్యార్థులకు జ్ఞాపికలతో కూడిన బహుమతులిచ్చి ఘనంగా వీడ్కోలు పలికారు. తొలుత విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరిని అలరించాయి. పాఠశాల ప్రిన్సిపాల్ ఎ.హర్షచంద్రారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు శామ్యూల్, ఇతరసిబ్బంది పాల్గొన్నారు.



పురవీధుల్లో స్వామివారి ఊరేగింపు

వైభవంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

పమిడిముక్కల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మంటాడ వెంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగు తున్నాయి. ఉత్సవాల్లో నాల్గో రోజు గురువారం స్వామికి విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం గ్రామోత్సవం నేత్రపర్వంగా జరిపారు. పరిసర గ్రామాలనుంచి భక్తులు తరలివచ్చి ఉత్సవంలో పాల్గొన్నారు.

వీరమ్మ విగ్రహ ప్రతిష్ఠ రేపు

గుడ్లవల్లేరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) :మామిడికోళ్ల గ్రామంలో వేంచేసియున్న వీరమ్మతల్లి అమ్మవారి ఆలయం శిథిలావస్థకు చేరింది. గ్రామస్థులు, దాతల సహకారంతో నూతనంగా నిర్మించిన ఆలయ , విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు ఈనెల 15 శనివారం నుంచి 17 సోమవారం వరకూ జరుగనున్నాయని నిర్వాహకకమిటీ వారు తెలిపారు. 15 శనివారం గోపూజ,యాగశాల ప్రవేశం,విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచన, మృత్యంగ్రహణ, అంకురార్పణ,అగ్ని ప్రతిష్ఠ ఇత్యాది కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 16 ఆదివారం వాస్తుపూజ, వాస్తుహోమం, పర్యగ్నికరణ,శాంతికుంభ స్థాపన,యాగశాలార్చన, అదివాస హోమం, శాంతి హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 17 సోమవారం యస్త్ర స్థాపన, బింబస్థాపనలు, పూర్ణాహుతి, కుంభాభిషేకములు నిర్వహించనున్నారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహిస్తారని నిర్వాహకులు తెలిపారు. ప్రతిష్ఠా కార్యక్రమానికి విశిష్ట అతిధులుగా మచిలీపట్నం పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలసౌరి, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాములు పాల్గొననున్నారని తెలిపారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి

గుడ్లవల్లేరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) :మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని గుడివాడ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎస్.వాసుదేవ్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం గుడ్లవల్లేరులో బీసీ సంక్షేమ బాలికల కళాశాల వసతిగృహంలో విద్యార్థినులకు బాలికా సంరక్షణ, సైబర్ నేరాలపై అవగాహనా కార్యక్రమంలో న్యాయాధికారి పాల్గొని అవగాహన కల్పించారు. నిత్యం సమాజంలో మహిళలలకు ఎదురైయ్యే సమస్యలు వాటినుండి ఎలా రక్షణ పొందాలి, సైబర్ నేరస్తుల బారిన పడకుండా ఎలా తమను తాము రక్షించుకోవాలి అనే అంశాలపై ఆయన వివరించారు. అనంతరం బాలికల వసతీగృహాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం వసతీగృహంలో విద్యార్థులకు సరిపడా బెడ్లు ఉన్నాయా, లేదా అనే వివరాలు అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.కార్యక్రమంలో తహసీల్దారు లోకరాజు, ఎస్సై ఎన్.వి.వి.సత్యనారాయణ, ఐసీడీఎస్ ఏసీడీపీవో పద్మావతి, గుడివాడ బీసీ వెల్ఫేర్ అసిస్టెంట్ ఆఫీసర్ కె.గురవమ్మ, వసతిగృహ వార్డెన్ బి.బేబి, వి.ఆర్.ఓ ఎస్.ప్రకాష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయాధికారి వాసుదేవ్

ఆద్యంతమూ భక్తిభావం .. కూచిపూడి అభినయం



అభినయాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

కూచిపూడి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): బాలాత్రిపుర సుందరిదేవి సమేత రామలింగేశ్వర స్వామి వార్షిక కల్యాణ మహోత్సవ వేడుకల్లో భాగంగాప్రముఖ నాట్యాచార్యులు డాక్టర్ వేదాంతం రాధేశ్యామ్ ఆధ్వర్యంలో మూడవ రోజైన గురువారం పలువురు కళాకారులు ప్రదర్శించిన నాట్యాంశాలు ఆద్యంతమూ భక్తిభావంలో ముంచెత్తాయి. మాదు కోమల బాబు శిష్య బృందం కౌశిక్, శృతి, ప్రియాంక, చైత్ర, దిశిత, యాక్షిక, సుధలు వినాయక స్తుతి, రామాయణ శబ్దం, బ్రహ్మాంజలి, కృష్ణశబ్దం అంశాలు ప్రదర్శించి ప్రేక్షకులను మైమరపింపజేశారు. ఈ అంశాలకు నట్టువాంగం పసుమర్తి రత్తయ్య శర్మ, గాత్రం పావని, మృదంగం హరనాథ శాస్త్రి, వయోలిన్ దక్షిణా మూర్తి సహకరించి నాట్యాంశాలకు వన్నె తెచ్చారు. కళాకారులను రాధేశ్యామ్ జ్ఞాపికలు అందించి సత్కరించారు.

కార్పొరేషన్ల రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

తోట్లవల్లూరు : 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ, కాపు కార్పొరేషన్‌ల ద్వారా వివిధ పథకాలకు సంబంధించి సబ్సీడీ రుణాలు పొందేందుకు అర్హులైన లబ్ధిదారులు ఈ నెల 22లోపు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో రవికాంత్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఏపీ ఓబీఎంఎంఎస్ ద్వారా దరఖాస్తుదారుడు తన పేరుని ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన దరఖాస్తుదారులు వార్షిక ఆదాయం రూ 81 వేలు లోపు ఉండాలని, 21 నుండి 60 సంవత్సరాల లోపు వయస్సు కలిగి ఉండాలన్నారు. కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాల వారు 50 సంవత్సరాల లోపు వయస్సు కలిగి ఉండాలన్నారు. ఇతర వివరాలకు మండల పరిషత్ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

విశ్వభారతి వార్షికోత్సవం

గుడివాడ, మార్చి 13(ఆంధ్రజ్యోతి) : స్థానిక విశ్వభారతి ఇంగ్లీషు మీడియం ప్రాథమిక పాఠశాల 57వ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. తొలుత వేడుకలను పాఠశాల డైరెక్టర్ ఆర్.మంజుల జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన చైనా సాంప్రదాయ నృత్యం, రష్యన్ బెల్ నృత్యం వంటి సాంస్కృతిక నృత్యాలు అలరించాయి. శివాజీ, ఆయన తల్లి జిజియాబాయి పాత్రల్లో చిన్నారులు చేసిన ఏకపాత్రాభినయాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల స్థాయిలో నిర్వహించిన చెస్ పోటీల్లో విజేతలుగా నిలిచిన ఎ.శ్రీరంగనాథ్ (7వ తరగతి), డి.మహిమారాతుల్ (5వ తరగతి),డి.సోఫీ ఆరాధ్య(3వ తరగతి) లకు పాఠశాల చైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ ట్రోఫీలను అందజేశారు. ప్రిన్సిపాల్ కె.రాధ, పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న పాఠశాల డైరెక్టర్ మంజుల

ఘనంగా కవయిత్రి మొల్ల జయంతి

గుడివాడ, మార్చి 13(ఆంధ్రజ్యోతి) : స్థానిక షా గులాబ్‌చంద్ ప్రథమశ్రేణి శాఖ గ్రంథాలయంలో తెలుగు భాషా వికాస సమితి ఆధ్వర్యంలో మహా కవయిత్రి మొల్ల జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ ఉపాధ్యాయురాలు చక్కా శకుంతలకు మహాకవయిత్రి మొల్ల సాహితీ స్ఫూర్తి పురస్కారం-2025 అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏఎన్ఆర్ కళాశాల పూర్వ తెలుగు శాఖ అధిపతి కొడాలి సోమసుందరరావు మాట్లాడుతూ 16వ శతాబ్ధంలో కవయిత్రి మొల్ల రచించిన రామాయణం ఆధ్యాత్మిక గ్రంథాలకు మణిమకుటుంగా బాసిల్లిందన్నారు. సమితి సమన్వయకర్త డీఆర్‌బీ ప్రసాద్, గ్రంథాలయాధికారి బీరం వెంకటరమణ, సాహితీవేత్తలు మోహన్‌బాబు, నరేంద్ర పాల్గొన్నారు.



శకుంతలకు పురస్కారాన్ని అందజేస్తున్న తెలుగు బాషా వికాస సమితి సభ్యులు

సమస్యలు పరిష్కరించాలని వినతి

గుడివాడ రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): గుడివాడ రూరల్ మండలంలో పెన్షన్ల పంపిణీ, పీ4 సర్వే, వర్క్ ఫ్రమ్ హోమ్, ఎంఎస్‌ఎంఈ, ఇతర సర్వేలలో గ్రేడ్-1 పంచాయతీ సెక్రటరీ వారు ఎటువంటి భాగస్వామ్యం లేకుండా గ్రేడ్-1 వీఆర్వోలపై పని ఒత్తిడి చేస్తున్నారని పలువురు వీఆర్వోలు ఆరోపించారు. గ్రేడ్-1 వీఆర్వోలకు మాత్రం ఎక్కువ క్లస్టర్‌లు వేస్తూ , టార్గెట్‌లు ఇస్తూ మెమోలు ఇస్తున్నారని పంచాయతీ సెక్రటరీలు వాపోయారు. పంచాయతీ సెక్రటరీలు మాత్రం ఎటువంటి డ్యూటీలు వేసుకోకుండా కేవలం పెత్తనం చేస్తూ పర్యవేక్షణ చేస్తున్నారన్నారు. వీఆర్వోలు పడుతున్న సమస్యలపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని గుడివాడ తహసీల్దార్‌కి గుడివాడ మండల గ్రేడ్-1 వీఆర్వో అసోసియేషన్ తరఫున వినతిపత్రాన్ని గురువారం అందజేశారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	90, 97, 107
చికెన్ విత్ స్కిన్	170
చికెన్ స్కిన్‌లెస్	180

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

వినూత్న రీతిలో పర్యావరణ హితంగా హోలీ



మచిలీపట్నం టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : హోలీ పండుగను పింగళి వెంకయ్య వైద్యకళాశాల విద్యార్థులు గురువారం వినూత్న రీతిలో జరిపారు. బాడీ పెయింటింగ్ బొమ్మలతో రంగోలీ వేడుకలు జరిపారు. జూనియర్ డాక్టర్లకు వైద్య రంగంలో విషయ పరిజ్ఞానం పెంపొందించేందుకు బాడీ పెయింటింగ్ ఆర్ట్ గ్యాలరీ, వైరస్ రహిత బొమ్మలతో రంగోలీ జరిపారు. ప్రిన్సిపాల్ ఆశలత వారిని అభినందించారు.



అనుమతులు ఇప్పించాలంటూ కరపత్రాలతో నిరసన వ్యక్తం చేస్తున్న పట్టాభి స్మారక భవన నిర్మాణ సాధన సమితి సభ్యులు

పట్టాభి స్మారక భవనానికి పేర్ని నాని అడ్డు తగలడం తగదు

మచిలీపట్నం టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : కోట్లాది రూపాయలతో ప్రజలకు ఉపయోగపడే విధంగా పట్టాభి స్మారక భవనాన్ని నిర్మిస్తామంటే మాజీ మంత్రి పేర్ని నాని ఎందుకు అడ్డుతగులుతున్నారో ఆత్మ పరిశీలన చేసుకుని ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని పట్టాభి స్మారక భవన నిర్మాణ సాధన సమితి సభ్యులు పేర్కొన్నారు. పట్టాభి స్మారక భవన నిర్మాణానికి కేటాయించిన స్థలం వద్ద కరపత్రాలు చూపుతూ నిరసన వ్యక్తం చేశారు. పట్టాభి స్మారక భవనాన్ని నిర్మించి తీరుతామని పత్రికాముఖంగా తెలియ చేసిన మంత్రి కొల్లు రవీంద్రకు కృతజ్ఞతలు తెలిపారు. భవన సాధన సమితి సభ్యులు పి.వి.ఫణికుమార్, ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి, సూరిశెట్టి హరికృష్ణ, కె.వి.రామారావు, పి.ఎస్.ఎస్.ఆర్. శర్మ, జె. ప్రసాద్, మోపర్తి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



విశేష అలంకరణలో విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ, దర్శించుకుంటున్న భక్తులు



పెదప్రోలు నాంచారమ్మ ఆలయంలో విశేష ఏర్పాట్లు

విశ్వనాథపల్లి నాంచారమ్మ జాతర ప్రారంభం

కోడూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : విశ్వనాథపల్లి గ్రామంలో కృష్ణానది తీరాన కొలువై ఉన్న అద్దంకి నాంచరమ్మ అమ్మవారి జాతర మహోత్సవం గురువారం వైభవంగా ప్రారంభమైంది. ఆలయ అర్చకులు పార్థసారథి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జాము నుంచే భక్తులు పశువులను ఆలయం చుట్టూ తిప్పుతూ మొక్కుబడులను చెల్లించుకున్నారు. జాతర నేపథ్యంలో అమ్మవారు విశేషాలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారి ఆలయ ప్రధాన జాతర శుక్రవారం జరుగనున్న నేపథ్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా పూర్తిస్థాయి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈవో జయశ్రీ తెలిపారు.

వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసే భక్తుల కోసం అవనిగడ్డ నుంచి విశ్వనాథపల్లికి ప్రత్యేకంగా 12 ఆర్టీసీ బస్సులను నడుపుతున్నట్లు డీఎం తెలిపారు. 200 మంది పోలీసు సిబ్బందితో ట్రాఫిక్ నియంత్రణకు, బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



హుండీ ఆదాయం రూ.2.46 లక్షలు

విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ హుండీ కానుకలను గురువారం లెక్కించగా రూ.2,46,071లు వచ్చినట్లు ఈవో జయశ్రీ తెలిపారు. మచిలీపట్నం దేవదాయ, ధర్మదాయ శాఖ అధికారులు, గ్రామ పెద్దలు పర్యవేక్షణలో హుండీ లెక్కించినట్లు తెలిపారు. నాలుగు నెలల 20 రోజులకు రూ.2,46,071లు వచ్చిందన్నారు. గ్రామ ప్రముఖులు తోట రాంబాబు, తోట లక్ష్మణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పెదప్రోలులో జాతర నేడు

మోపిదేవి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెదప్రోలులో అద్దంకి నాంచారమ్మ అమ్మవారి వార్షిక జాతర మహోత్సవం ఈ నెల 14వ తేదీ శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటలకు ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన కార్యక్రమంతో జాతర మహోత్సవం ప్రారంభమవుతుంది. 50 వేల మందికిపైగా భక్తులు జాతరకు విచ్చేస్తారని అధికారులు అంచనా వేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయంలో ఏ విధమైన ఇబ్బంది కలుగకుండా ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేశారు. ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు, చాందిని టెంట్లతో అలంకరణ గావించారు. ప్రధాన రహదారుల వెంబడి విద్యుత్ దీపాలు, సకల దేవతల ప్రతిమలతో ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. అవనిగడ్డ డీఎస్పీ తాళ్లూరి విద్యశ్రీ, చల్లపల్లి సీఐ ఈశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. వార్షిక జాతర మహోత్సవం సందర్భంగా రాత్రికి అమ్మవారు ఆలయ ప్రవేశం చేస్తారు. పవళింపు సేవా కార్యక్రమంతో 15వ తేదీ వార్షిక జాతర మహోత్సవం ముగియనున్నట్లు ఆలయ కమిటీ కార్యదర్శి కెవిఎస్.కె.కోటేశ్వరరావు తెలిపారు.

ప్రత్యేక సంగీత విభావరి

వార్షిక జాతర మహోత్సవం సందర్భంగా ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అన్నమాచార్య కీర్తనలు, కూచిపూడి, భరత నాట్యం, భక్త చింతామణి, బాలనాగమ్మ నాటకం, ప్రముఖ సినీ గాయని శ్రావణ భార్గవి మెలోడియస్ ఆధ్వర్యంలో సంగీత విభావరి ఏర్పాటు చేసినట్లు కార్యదర్శి కోటేశ్వరరావు తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న జనసేన నగర అధ్యక్షుడు రాజు

జనసేన ఆవిర్భావ దినోత్సవ సభకు బందరు నుంచి భారీ ర్యాలీ నేడు

మచిలీపట్నం టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురంలో జరిగే జనసేన ఆవిర్భావ దినోత్సవ సభకు మచిలీపట్నం నుంచి పార్టీ శ్రేణులు బస్సులు, కార్లలో భారీ ర్యాలీగా తరలివెళ్లనున్నట్లు జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు తెలిపారు. మచిలీపట్నం నుంచి వెళ్ళే నాయకులు, కార్యకర్తలకు ఏ విధమైన ఇబ్బందులు లేకుండా తాగునీరు, అల్పాహారం, మజ్జిగ, భోజన సదుపాయాలు ఏర్పాటు చేశారన్నారు. జనసేన కార్పొరేటర్ పినిశెట్టి ఛాయాదేవి, నాయకులు గల్లా తిమోతి, వంపుగడల చౌదరి, కొట్టె వెంకట్రావు, శాయన శివ, వడ్డి చిరంజీవి, తోట రాజేష్, కొక్కు లక్ష్మణ, నరహరిశెట్టి రామ్‌జ్యోతి, పెదశింగు చిరంజీవి, పినిశెట్టి వేణు, కూనపరెడ్డి ప్రసాద్, రమేష్, సునీల్ పాల్గొన్నారు.

అర్హులైన పేదలందరికీ ఇళ్లపట్టాలు ఇవ్వాలి

మచిలీపట్నం టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం 28వ డివిజన్ జలాల్‌పేటలో గత 20 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాలు అందించాలని సీపీఎం మచిలీపట్నం నగర కార్యదర్శి బి. సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా గురువారం 23, 28 డివిజన్లలో సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై పేదలను కలసి సమస్యలు తెలుసుకున్నారు. సీపీఎం నాయకులు కొడాలి శర్మ, సిహెచ్. జయరావు, ఎండి యూనస్, తమ్ము చాందిని దుర్గ, ప్రజానాట్య మండలి కార్యదర్శి దమ్ము శివకేశ్వర్ పాల్గొన్నారు.



ఎస్పీ గంగాధరరావుకు వినతిపత్రం ఇస్తున్న వీహెచ్‌పీ నేతలు

రాయచోటి ఘటనలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

మచిలీపట్నం టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : రాయచోటిలో హిందువుల మీద జరిగిన లాఠీ చార్జీ జరిపిన వారిపై కఠిన చర్య లు తీసుకోవాలని కోరుతూ విశ్వహిందూ పరిషత్ సభ్యులు గురువారం జిల్లా ఎస్పీ ఆర్. గంగాధరరావుకు వినతిపత్రం సమర్పించారు. విశ్వహిందూ పరిషత్ సభ్యులు, జిల్లా కార్యదర్శి అల్లూరి కాంతారావు, మచిలీపట్నం ప్రఖండ అధ్యక్షుడు పులపర్తి శ్రీనివాసరావు, మోపిదేవి ఖండ అధ్యక్షుడు అర్జా ఏడుకొండలు, ప్రముఖ న్యాయవాది కూనపరెడ్డి శ్రీనివాసరావు, జిల్లా ప్రచార ప్రముఖ్ గరికపాటి వెంకట్రావు, డాక్టర్ ఉడత్తు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

లక్ష్మీజయంతి ఉత్సవాలకు ఎస్పీకి ఆహ్వానం

జగద్గురు శ్రీరామానుజచార్య సంస్థాన్ ఆధ్వర్యంలో లక్ష్మీజయంతి సందర్భంగా ఈనెల 14 నుంచి 17వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గుదిమెళ్ళ శ్రీనివాస శ్రీకర స్వామి తెలిపారు. జిల్లా ఎస్పీని గురువారం కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. శుక్రవారం రాత్రి లక్ష్మీనారాయణుల కల్యాణం. 15వ తేదీ సాయంత్రం 4 గంటలకు 127 గరుడ వాహనాలపై జరిగే దివ్య గరుడ సేవ ర్యాలీకి అనుమతి ఇవ్వాలని శ్రీకర రామానుజ కోరారు.



గుండేరు డ్రెయిన్ పనులను ప్రారంభిస్తున్న తూర్పు కృష్ణా డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, పక్కన అక్విడెక్టు పనుల పరిశీలన

గుండేరు మేజర్ డ్రెయిన్ పనులు ప్రారంభం

చల్లపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కృషితో నియోజకవర్గంలో డ్రైనేజీల అభివృద్ధి పనులకు రూ.మూడు కోట్లు మంజూరైనట్లు తూర్పుకృష్ణా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, యువనేత మండలి వెంకట్రామ్ తెలిపారు. లక్ష్మీపురం నుంచి మాజేరు వరకూ గుండేరు మేజర్ డ్రెయిన్‌లో కిక్కిస తొలగింపు పనులను గురువారం ప్రారంభించారు. గుండేరు, రత్నకోడు సహా పలు మేజర్, మీడియం, మైనర్ డ్రైనేజీల్లో కిక్కిస తొలగింపు, పూడికతీత పనులు చేపట్టనున్నారనీ, తద్వారా తమది రైతు ప్రభుత్వమని మరోసారి నిరూపించారన్నారు. చల్లపల్లి డ్రైనేజీ డీఈ జె.బాబూనాయక్, చల్లపల్లి డీసీ చైర్మన్ నిడమానూరి దిలీప్‌కుమార్, నీటిసంఘం అధ్యక్షులు పరిశె చలపతిరావు, ఎంపీటీసీ తాడికొండ వెంకటేశ్వరరావు(చిన్నా), ఏఈ చిరంజీవి, టీడీపీ నేతలు గుడివాక శివరావు, గువ్వాబత్తిన నాగేశ్వరరావు, దిరిశం వెంకట్రావ్, బండే రాఘవ, తుమ్మలగుంట గోపాలకృష్ణ, సింహాద్రి పవన్, గుడివాక నరహరి, మండలి సుదీర్, మురాద్‌బేగ్, వాసు పాల్గొన్నారు.

అక్విడెక్ట్ పనుల పరిశీలన

అవనిగడ్డ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : దివి ప్రాంత వాసుల జీవనాడి పులిగడ్డ అక్విడెక్ట్ పనులను తూర్పు కృష్ణా డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు గురువారం పరిశీలించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చొరవతో రూ.1.10 కోట్లు మంజూరు కాగా, ఈ పనులను ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వర రావు, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్‌తో కలిసి పరిశీలించారు. పనులను శరవేగంగా చేస్తున్నారని మండలి వెంకట్రామ్ అన్నారు. డీఈ పులిగడ్డ వెంకటేశ్వరరావు, నీటి సంఘాల అధ్యక్షులు దాసినేని శ్రీనివాసరావు, కూటమి నాయకులు గుడివాక శివరావు, మండలి రామ్మోహనరావు, మండలి శేషు, సింహాద్రి పవన్, మండలి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

భార్య మృతికి కారణమైన భర్తకు ఏడేళ్ల జైలు శిక్ష

మచిలీపట్నం టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : అదనపు కట్నం కోసం వేధించి ఆత్మహత్యకు ప్రేరేపించి భార్య మరణానికి కారణమైన కేసులో నిందితుడికి ఏడేళ్ల జైలు శిక్ష, రూ. 3 వేల జరిమానా విధిస్తూ ఆరో అదనపు జిల్లా జడ్జి ఏ. పూర్ణిమ గురువారం తీర్పు ఇచ్చారు. ఈడేపల్లికి చెందిన వెంకటరామప్రసాద్ తన రెండో కుమార్తె అమలేశ్వరిని గూడూరు మండలం ఆకుమర్రు గ్రామానికి చెందిన రామకృష్ణకు ఇచ్చి 2017లో వివాహం జరిపాడు. వారికి ఇద్దరు ఆడపిల్లలు పుట్టడంతో అదనపు కట్నం ఇవ్వాలని భర్త, అత్త వేధించడం ప్రారంభించారు. ఈ వేధింపులు తాళలేక 2020లో వివాహిత అమలేశ్వరి ఉరి వేసుకుని మరణించింది. మృతురాలి తండ్రి వెంకటరామప్రసాద్ ఫిర్యాదు మేరకు భర్త, అత్తింటి వారిపై గూడూరు అప్పటి ఎస్సై సిహెచ్. కనకదుర్గారావు కేసు నమోదు చేశారు. డీఎస్పీ మెహబూబ్ బాషా విచారణ జరిపి చార్జ్ షీటు దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. పోలీసులు క్రియాశీలక పాత్ర పోషించినందున ఎస్పీ ఆర్. గంగాధరరావు అభినందించారు.



ప్రసంగిస్తున్న ఎన్నారై బొబ్బా గోవర్ధన్

క్రీస్తు శాంతి సందేశాన్ని ఆచరించాలి

చల్లపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : క్రీస్తు శాంతి సందేశాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించాలని ఎన్నారై, నియోజకవర్గ టీడీపీ నాయకులు బొబ్బా గోవర్ధన్ అన్నారు. చల్లపల్లి మండలం రామానగరంలోని హోలీఫైర్ గ్రౌండ్స్‌లో జరిగిన క్రైస్తవ పరిశుద్ధ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. క్రీస్తు బోధనలు సర్వమానవాళికి అనుసరణీయమన్నారు. పాస్టర్ రెవరెండ్ డా.ఎం.మరియకుమార్ ఆధ్వర్యంలో జరిగిన మహాసభలో పలువురు దైవసేవకులు, ప్రముఖులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

కోడూరులో యథేచ్ఛగా బెల్టుషాపులు

కోడూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాలు మూసివేసిన దగ్గర నుంచి బెల్టుషాపులు నడుపుతున్నా ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టించుకోవటం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అన్ని గ్రామాల్లో బెల్టుషాపులు నడుపుతూ అధిక రేట్లు వసూలు చేస్తున్నం దున స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



సర్పంచ్, ఈవోలకు వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నేతలు, స్థానికులు

నారాయణరావు నగర్ కాలనీ సమస్యలు పరిష్కరించాలి

చల్లపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లి నారాయణరావునగర్ కాలనీ, కొత్తగా ఏర్పడిన కాలనీల్లో సమస్యలు పరిష్కారం చేయాలని సీపీఎం నేతలు, స్థానికులు కోరారు. ప్రజా చైతన్య యాత్ర కార్యక్రమంలో భాగంగా ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కారం కోరుతూ చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఈవో పి.వి. మాధవేంద్రరావులకు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి యద్దనపూడి మధు, వాకా రామచంద్రరావు, మహమ్మద్ కరీముల్లా తదితరులు పాల్గొన్నారు. రహదారులు, వీధిదీపాలు, డంపింగ్ యార్డు వద్ద ప్రహరీ నిర్మాణం తదితర సమస్యలు పేర్కొన్నారు.



ఏఎస్సై వీరాంజనేయులుకు ఆత్మీయ సత్కారం

కోడూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కోడూరు పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహించిన లంకోజి వీరాంజనేయులును పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు బుధవారం రాత్రి ఎస్సై చాణిక్య ఆత్మీయ సత్కారం చేశారు. అవనిగడ్డ డిఎస్పీ టి.విద్యశ్రీ, సీఐ యువకుమార్, ప్రజాప్రతినిధులు ఏఎస్సై దంపతులను ఘనంగా సత్కరించారు.

ఉచిత నేత్ర వైద్యశిబిరం 16న

నాగాయలంక, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మారుతీ విద్యానికేతన్ డిజిటల్ ఏసీ స్కూల్ ఆవరణలో ఈ నెల 16వ తేదీ ఉదయం దాత బొబ్బా గోవర్ధన్ ఆర్థిక సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తలశిల రఘు శేఖర్ తెలిపారు.

లక్ష్మీనృసింహస్వామి కల్యాణం

గూడూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : గూడూరులో రాజ్యలక్ష్మీ సమేత లక్ష్మీనృసింహస్వామి కల్యాణం గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం ఎదుర్కోలు సన్నాహం, జగాజ్యోతి జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈవో ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చిట్టిపాలెంలో చండీహోమం

మచిలీపట్నం టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : చిట్టిపాలెం లో పార్వతీ సమేత అర్ధనారీశ్వర స్వామి దత్త పాదుకా మందిరంలో గురువారం లోకకళ్యాణార్థం చండీ హోమం నిర్వహించారు. డాక్టర్ చావలి పవన్ వంశీ పర్యవేక్షించారు.

ముక్కొల్లులో మహంకాళమ్మ జాతర

గూడూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ముక్కొల్లులో మహంకాళమ్మ అమ్మవారి జాతర ఉత్సవం గురువారం అత్యంత వైభవంగా జరిగింది. అమ్మవారిని గ్రామ పురవీధుల్లో ఊరేగింపు జరిపారు. వందలాది మంది భక్తులు అమ్మవారికి మొక్కుబడులు తీర్చుకున్నారు.

సృజనాత్మకతను చాటాలి



ఎగ్జిబిట్స్ పరిశీలిస్తున్న స్వర్ణలత

నాగాయలంక, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకోవాలని తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత ఉద్బోధించారు. స్కా లర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఆమె సందర్శించారు. సునీల్ కుమార్ పట్నాయక్, నిర్మలా పాణిగ్రాహి పర్యవేక్షించారు.

చినకరగ్రహారంలో నాంచారమ్మ సంబరాలు



మచిలీపట్నం టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : చినకరగ్రహారంలో వైభవంగా లక్ష్మీనాంచారమ్మ తల్లి సంబరాలు గురువారం జరిగాయి. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, జిల్లా తెలుగురైతు అధ్యక్షుడు గోవు సత్యనారాయణ పాల్గొన్నారు.